

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం 07 సెప్టెంబర్ 2025 పేజీలు : 04

# ఆర్థిక విధ్వంసం జరిగిన రాష్ట్రంలో ఎంతో సాహసోపేతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం

- రాష్ట్రాన్ని వెంటిలేటర్ పైనుంచి సాధారణ స్థితికి తీసుకొచ్చాం
- కేంద్రం సహకారంతో రాష్ట్రాన్ని గాడిలో పెట్టాం : మంత్రి పయ్యావుల కేశవ వెల్లడి




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు

**అనంతపురం, సెప్టెంబర్ 6, (ప్రభాతవార్త బ్యూరో)**

కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వెంటిలేటర్ పైనుంచి సాధారణ స్థితికి తీసుకొచ్చాం. ఆర్థిక విధ్వంసం జరిగిన రాష్ట్రంలో అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం అని రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. ఈనెల 10న అనంతపురంలో జరగనున్న సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ తో పాటు రాష్ట్ర మంత్రులు నారాయణ, కొల్లు రవీంద్ర, గొట్టి పాటి రవికుమార్, అనగాని సత్య ప్రసాద్, రాంప్రసాద్ రెడ్డి, సవిత, తదితర ఎమ్మెల్యేలు, ఎంపీలతో కలిసి సీఎం చంద్రబాబు హాజరయ్యే హెలిప్యాడ్ వద్ద పరిస్థితిని చూశారు. అనంతరం సభా స్థలి వద్దకు వెళ్లి.. అక్కడ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నాయకులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు కేశవ్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రం ఇప్పుడే వెంటిలేటర్ నుంచి సాధారణ పరిస్థితికి వచ్చిందని ఇలాంటి సమయంలో ఎవరు ఊహించని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. సంక్షేమాన్ని డబుల్ చేస్తూ అభివృద్ధిని కూడా రెట్టింపు చేసే స్థాయిలో తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రంలో ధరలు తగ్గించే ప్రక్రియ కూడా వేగంగా సాగుతుందన్నారు. ప్రజల నుంచి తమకు సంపూర్ణ మద్దతు ఉందని... తాము అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజలతో సంతోషాన్ని పంచుకునేందుకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీలో మార్పులు చేస్తే వైయస్ జగన్ విష ప్రచారం చేస్తున్నారు మంత్రి అనగానే ప్రసాద్ సమావేశంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికీ అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రాష్ట్రంలో పాలన సాగుతోందన్నారు. ఈ వేదిక నుంచి మరికొన్ని వర్గాలకు అందించే సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన ప్రకటన ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతిపక్ష హోదా లేని ప్రతిపక్ష నేత జగన్మోహన్ రెడ్డి నిత్యం కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ కి సంబంధించిన కొన్ని మంచి మార్పులు తీసుకొస్తే దానిపై కూడా విష ప్రచారం చేస్తున్నారన్నారు. ఇలాంటి వాటిని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని.. ఈ సభకు ఊహించని రీతిలో జనం కూడా వస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభలో రాప్తాడు సత్తా చూపిద్దాం

- మహిళా లోకం పెద్ద ఎత్తున తరలిరావాలి - పర్చూరు ఎమ్మెల్యే సాంబశివ రావు, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు
- సూపర్ హిట్ సభపై రాప్తాడులో టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం - పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసిన నేతలు




పర్చూరు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావును సన్మానిస్తున్న దృశ్యం

**రాప్తాడు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

అనంతపురంలో జరగబోయే సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి రాప్తాడు నియోజకవర్గంలో టీడీపీ సత్తా ఏంటో చూపిద్దామని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. ఈనెల 10న విజయోత్సవ సభ జరగనున్న నేపథ్యంలో దీనిని విజయవంతం చేసేందుకు నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. రాప్తాడు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రాప్తాడు నియోజకవర్గం కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మన్నే సుబ్బారెడ్డి, రాప్తాడు అబ్జర్వర్ ఆదోని కృష్ణమ్మ ఇతర కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సభకు ఎంత మంది వస్తారు. వారి వాహనాలు, భోజన సౌకర్యాలు ఎలా చేయాలన్న అంశం గురించి నాయకులు చర్చించారు. కార్యక్రమానికి సంబంధించి నాయకులు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. గత రెండేళ్లలో రాష్ట్ర స్థాయి కార్యక్రమాలు జిల్లాలో ఏవీ జరగలేదని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సభ జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వార్డుల దగ్గర నుంచి ప్రతి నాయకుడు, కార్యకర్త ఈ సభను విజయవంతం చేసే బాధ్యత తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తోందని, ఇందులో సూపర్ సిక్స్ పథకాలను ఏడాదిలోపే అమలు చేశామన్నారు. రాప్తాడు నియోజకవర్గం నుంచి 50వేల మందికి తగ్గకుండా జనం తరలివచ్చే అవకాశం ఉందన్నారు. ఇందులో సగం మందికి పైగా మహిళలే ఉంటారన్నారు. మరోవైపు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు మాట్లాడుతూ.. రాప్తాడు అంటే తెలుగుదేశం పార్టీకి కంచుకోట అన్నారు. ఇక్కడి ప్రజలు పరిటాల కుటుంబాన్ని, టీడీపీని ఎంతగా ఆదరిస్తున్నారో అందరికీ తెలుసునన్నారు. మనం గతంలో జగన్మోహన్ రెడ్డి లాగా ఇచ్చిన మాట తప్పలేదని.. ప్రతి హామీని నెరవేరుస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ పథకాలపై ప్రజల్లో మంచి స్పందన ఉందని, మరీ ముఖ్యంగా మహిళలు ఈ ప్రభుత్వ పని తీరుపై సంతోషంగా ఉన్నారన్నారు. స్వచ్ఛందంగానే ఈ కార్యక్రమాన్ని తరలివచ్చే అవకాశం ఉందని, ఇలాంటి సమయంలో నాయకులు చొరవ తీసుకుంటే ఈ సభను మరింత విజయవంతం చేయవచ్చన్నారు.

# కూటమి పాలనలో రైతాంగం పరిస్థితి దయనీయం

- పంట సాగు తగ్గినా యూరియా ఏ మవుతోంది
- రైతాంగ సమస్యలపై 9న ర్యాలీలు
- పోస్టర్ల ఆవిష్కరణలో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత




అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం సిటీ, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**

జిల్లాలో రైతాంగ పరిస్థితి కూటమి పాలనలో దయనీయంగా తయారైందని, ప్రభుత్వం కళ్లు తెరిపించి రైతు సమస్యల పరిష్కారం కోసం వైఎస్ఆర్‌సిపి ఆధ్వర్యంలో 9న అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాలలో ర్యాలీలను నిర్వహించి ఆర్డిఓలకు వినతిపత్రాలు అందిస్తామని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 9న జరగనున్న అన్నదాత పోరు కార్యక్రమం పోస్టర్లను వైసిపి జిల్లా కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, పార్టీ నేలతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ.. పంట విస్తీర్ణం పంట సాగు తగ్గినా యూరియా కొరత మాత్రం వెంటాడుతోందని, గతం కంటే ఎక్కువ సరఫరా చేస్తున్నామని చెబుతున్నా వచ్చిన యూరియా ఎక్కడికి వెళ్తోందని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ప్రశ్నించారు. జిల్లా వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. గత ఏడాది ఖరీఫ్, రబి సీజన్‌లలో అతివృష్టి, అనావృష్టితో పంటలు దెబ్బతిన్నా ఇన్సురెన్స్, ఇన్‌పుట్ సబ్సిడి అందించలేదని విమర్శించారు. కూటమి పాలనలో రైతుల పరిస్థితి దయనీయంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమం గురించి ఆలోచించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. కూటమి ప్రభుత్వంలో విత్తనం నుంచి ఎరువుల వరకు రైతులు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందని విమర్శించారు. రైతాంగ సమస్యలపై ప్రతిపక్షాలు ప్రశ్నించినా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా, పత్రికల్లో కథనాలు వచ్చినా ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి బెదిరిస్తారా అని ఆయన ప్రశ్నించారు. యూరియాను డిస్ట్రిబ్యూటర్లే అధికారులు, ప్రజా ప్రతినిధుల అండతో బ్లాక్ మార్కెట్‌కు తరలించారని విమర్శించారు. నేడు చిన్న వ్యాపారులపై విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తున్నారని బ్లాక్ మార్కెట్‌కు తరలించిన డిస్ట్రిబ్యూటర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. అన్నదాత పట్ల ప్రకృతి చిన్న చూపు చూస్తే ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. హెచ్ఎల్‌సికి నీరు వస్తున్నా నార్త్, సౌత్ కెనాల్‌కు నీరు విడుదల చేయడం లేదని ఆయన విమర్శించారు. తక్షణమే నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అన్నదాతల పట్ల కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యతిరేక విధానాలపై వైఎస్ఆర్‌సి ఆధ్వర్యంలో అన్ని రెవెన్యూ డవిజన్ కేంద్రాలలో 9వ తేది ర్యాలీలు చేపట్టి ఆర్డిఓలకు వినతిపత్రాలు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం నగరంలో జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద నుంచి ఆర్డిఓ కార్యాలయం వరకు ర్యాలీని కొనసాగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

# పోలీసు రక్షణతో ఫలించిన పెద్దారెడ్డి నిరీక్షణ

- భారీ బందోబస్తు మధ్య తాడిపత్రికి చేరిన పెద్దారెడ్డి - 15 నెలల తర్వాత స్వేచ్ఛగా సొంతింటికి చేరుకున్న కేతిరెడ్డి



తన స్వగృహంలోకి ప్రవేశిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి



బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ జగదీష్, ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి

**తాడిపత్రి, సెప్టెంబరు 6, ప్రభాతవార్త**

గత శాసనసభ ఎన్నికల సందర్భంగా ఘర్షణలు చోటు చేసుకున్నప్పటి నుంచి తాడిపత్రిలోని తన సొంతింటికి దూరంగా ఉంటున్న తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి 15నెలలతర్వాత ఎట్టకేలకు శనివారం భగత్‌సింగ్ నగర్‌లోని సొంతింటికి చేరుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి తాడిపత్రికి రావడానికి పెద్దారెడ్డి చేయని ప్రయత్నం లేదు. అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలతో భారీబందోబస్తుమధ్య పోలీసు రక్షణ కల్పించడంతో పెద్దారెడ్డి నిరీక్షణ ఫలించింది. మొదట తన స్వగ్రామం తిమ్మంపల్లిలో ఆయన నిర్మించిన శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో భార్య రమాదేవితో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉదయం 8.30 గంటలకు తాడిపత్రికి బయలు దేరారు. ఎస్పీ జగదీష్, ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరిల ప్రత్యేక పర్యవేక్షణలో ప్రధాన కూడళ్లతో పాటు ప్రత్యర్థులిద్దరి ఇళ్ల వద్ద ప్రత్యేకపోలీసుబలగాలతో గస్తీఏర్పాటుచేశారు. అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల అమలు తమ మెడకు చుట్టుకోకూడదనే పోలీసులు తగిన భద్రతతో పెద్దారెడ్డిని తాడిపత్రికి అనుమతించారు. అందుకు తగ్గట్లు ఇలియాజ్ బాషా అనే ఏఆర్ ఏఎస్పీ, నీలకంఠేశ్వరరెడ్డి, సూర్యనారాయణరెడ్డి అనే ఇద్దరు డీఎస్పీలతో పాటు 15మంది సీఐలను, 19మంది ఎస్సైలను, 16మంది పీఎస్సైలను, 65మంది ఏఎస్సై,హెడ్ కానిస్టేబుళ్లను, 175మంది కానిస్టేబుళ్లను పోలీసు బందోబస్తుకు కేటాయించారు. వీరుగాక తాడిపత్రి సబ్‌డివిజన్‌లోని పోలీసులందరూ బందోబస్తు విధులకు హాజరయ్యారు. ప్రధాన రహదారి నుంచి పెద్దారెడ్డి ఇంటి వరకు పోలీసులతో మూడంచెల వ్యవస్థను ఏర్పాటు చేసి భద్రతా చర్యలు చేపట్టారు.మేడ మీద నుంచి ఇంటి పరిసరాలను పరిశీలించి ఏడాదిన్నర కిందటి పరిస్థితిని గుర్తుచేసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులకు పూర్తిగా సహరిస్తామని,



జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటి వద్ద పోలీసు బందోబస్తు

తమ పార్టీ కార్యకర్తలు,ప్రజాసమస్యలపై మాత్రం శాంతియుతంగా గళమెత్తుతామని తెలిపారు. ఈ నెల 11 నుంచి దాడులకు గురైన తమ పార్టీ కార్యకర్తలు,అనుచరుల కుటుంబాలను పరామర్శించి వారిలో మనో ధైర్యం నింపుతామని అన్నారు. పల్లెల్లో యథావిధిగా తమ పార్టీ నాయకులను, అనుచరులను కలసి పార్టీ ఆదేశాల మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి ముందుకు సాగుతామని ఆయన తెలిపారు. అనంతరం వైకాపా రాష్ట్ర కార్యాలయం నుంచి ఫోన్ రావడంతో ఇక్కడి పరిస్థితిని వారికి ఆయన వివరించారు. 50 మంది అనుచరులకు మించకుండా తన వద్ద ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఆదివారం ఉదయం వరకు తాడిపత్రిలో ఉండి ఈ నెల 8న యాడికిలోని తమ పార్టీ కార్యాలయంలో మండల వ్యాప్త కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 11 నుంచి నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటూ యథావిధిగా తన కార్యకలాపాలను నిర్వహిస్తానని ఆయన అన్నారు. ఎస్పీ జగదీష్ తాడిపత్రిలోనే మకాం వేసి శాంతి భద్రతలను పర్యవేక్షించారు. పోలీసు ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు ఇక్కడి పరిస్థితులను వివరిస్తూ శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పారు.

# ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రుల బృందం

- ఈ నెల 10న నిర్వహించనున్న సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ కార్యక్రమం - సమన్వయంతో విజయవంతం చేయండి





ముఖ్యమంత్రి సభ వేదిక ఏర్పాట్లపై సమీక్షించి అనంతరం పరిశీలిస్తున్న మంత్రుల బృందం, కూటమి నాయకులు

**అనంతపురం, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త**

ఈనెల 10న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనంతపురం పర్యటనలో భాగంగా విచ్చేస్తున్న సందర్భంగా స్థానిక జిఎంఆర్ ఇంద్రప్రస్థ శ్రీనగర్ కాలనీ వైపు ఉన్న ప్రాంతంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ కార్యక్రమం రాష్ట్రస్థాయి సభ కార్యక్రమాల నిర్వహణ ఏర్పాట్లను రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక వాణిజ్య పనులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ పయ్యావుల కేశవ్, రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్, స్టాంప్ శాఖ మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్, వెనుకబడిన వర్గాల సంక్షేమం చేనేత, జౌళి శాఖ మంత్రివర్యులు ఎస్ సవితమ్మ, రాష్ట్ర పురపాలక పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డా. పి నారాయణ, ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ లు సంయుక్తంగా సభా వేదిక ఏర్పాటు, ఇతర పనులను శనివారం పరిశీలించారు. అనంతరం అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె పార్థసారథి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, కళ్యాణ్ దుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, సింగనమల శాసన సభ్యురాలు బండారు శ్రావణి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, అహుడా ఛైర్మెన్ టి. సి. వరుణ్, రాష్ట్ర నాయకులు కే. రవీంద్ర (నాని), కిలారి రాజేష్, చిలక మధుసూదన్ రెడ్డి జనసేన జిల్లా అధ్యక్షులు సత్యసాయి జిల్లా, అనంతపురం జిల్లా బిజెపి అధ్యక్షులు కొనకండ్ల రాజేష్, రాష్ట్ర



మీడియా ప్రతినిధి బి. వి . వెంకట రాముడు తో పాటు పలువురు కూటమి ముఖ్య నాయకులతో కలిసి సమీక్షించి మాట్లాడుతూ సభ నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొనే వారికి ఇబ్బందులు లేకుండా బాధ్యత యుతంగా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పార్కింగ్, భోజన వసతి, వేదిక ఏర్పాటు, భద్రత, ట్రాఫిక్ సడలింపు చర్యలు, త్రాగునీటి సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా ,పారిశుద్ధ్య పనులు తదితర మౌలిక వసతుల కల్పన అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రణాళిక బద్ధంగా పనులను పూర్తి చేయాలని మంత్రులు సభా కార్యక్రమాల నిర్వహణ బృందానికి సూచించారు. అనంతరం విలేకరులతో మంత్రులు మాట్లాడుతూ ఈ నెల 10న నిర్వహించనున్న సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ కార్యక్రమం సమన్వయంతో విజయవంతం చేయండని పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు అందుబాటులో ఉండాలి

- నాణ్యమైన వైద్య సేవలు అందించండి : కలెక్టర్




ఔట్ పేషెంట్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

**హిందూపురం సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

వైద్య చికిత్సల కోసం వచ్చే డాక్టర్లు సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ చేతన్ ఆదేశించారు. పట్టణంలోని జిల్లా స్థాయి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ హోదాలో కలెక్టర్ శనివారం పరిశీలించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. టి.ఎస్.చేతన్ అధ్యక్షతన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆస్పత్రిలోని ప్రతి విభాగాన్ని అంచలంచెలుగా అభివృద్ధి చేస్తామని, రోగులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. రోగులకు తక్షణ వైద్యసేవలు అందించేందుకు డాక్టర్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. విధులయందు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పనిచేయని సిబ్బందిని తొలగించి కొత్తవారిని నియమించాలన్నారు. డాటా ఎంట్రీ ఆపరేటర్ అవసరాన్ని బట్టి కొత్త నియామకాలు చేపట్టాలని సూచించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పార్కింగ్ సదుపాయాలు మిగతా 4 లో...

# 24 గంటల్లోపు ప్రతీకార హత్య కేసు ఛేదింపు

- ముగ్గురు నిందితుల అరెస్ట్‌జిల్లా ఎస్పీ వి.రత్న

**పుట్టపర్తి, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త**

తన తండ్రిని హత్య చేశాడన్న ప్రతీకారంతో ఓ వ్యక్తిని రెండు రోజుల క్రితం ధర్మవరం పట్టణంలో హత్య చేసిన సంఘటనలో హత్య కేసును 24 గంటల లోపే ఛేదించి ఇందులో పాల్గొన్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ వి.రత్న తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ ఈ హత్య కేసు వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మరియు డి.ఎస్.పి హేమంత్ కుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి, ధర్మవరం 2వ పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ వి. రెడ్డెప్ప ఆధ్వర్యంలో ధర్మవరం పట్టణంలో వ్యక్తిగత ద్వేషం కారణంగా లోకేంద్ర అనే వ్యక్తిని కారు తో దాడి గుద్ది, దాడి చేసి హత్య చేసిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. నిందితులు ధర్మవరం పట్టణం కు చెందిన తెల్లగడ్డలు అల్లం వ్యాపారం చేసుకునే భూచిపల్లి బాలకృష్ణ రెడ్డి , సయ్యద్ ఇలియాజ్, దేరంగుల అంజినేయులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిపై క్రైమ్ నెంబర్ 184/2025 అండర్ సెక్షన్ 103(1) ఆర్/డబ్ల్యూ3(5) బి ఎన్ ఎస్ యాక్ట్ క్రింద,




వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ వి.రత్న

ధర్మవరం 2వ పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. కేసు పూర్వాపరాలు పరిశీలిస్తే, హత్య జరిగిన రోజు 04.09.2025 సాయంత్రం సుమారు 5:45 గంటల సమయంలో, ధర్మవరం పట్టణంలోని కొత్తపేట శ్రీనిధి మార్ట్ ముందు లోకేంద్ర తన తండ్రితో కలిసి చెల్లెలి ఇంటికి వెళ్లే మార్గంలో ఆగాడు. అతని తండ్రి టీ తాగడానికి వెళ్లగా, లోకేంద్ర తన స్నేహితుడితో మిగతా 4 లో...

# మాజీమంత్రి నివాసానికి విచ్చేసిన రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత శాఖ మంత్రి సవిత



పల్లె వెంకట కృష్ణ కిషోర్‌కు పుట్టిన రోజు సందర్భంగా కేక్ తినిపిస్తున్న మంత్రి సవిత

**అనంతపురం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త బ్యూరో**

అనంతపురం రుద్రంపేట సమీపంలోని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి నివాసానికి శనివారం రాష్ట్ర బీసీ చేనేత సంక్షేమ శాఖ మంత్రి సవితా విచ్చేశారు. పీవీ కేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి జన్మదినం సందర్భంగా మంత్రి సవిత ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డికి వైరల్ ఫీవర్ వచ్చి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న దృష్ట్యా మాజీ మంత్రినీ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఇంటికి విచ్చేసిన రాష్ట్ర బీసీ చేనేత సంక్షేమ శాఖ మంత్రి సవితకు ఆడ పడుచు ఇంటికి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పసుపు కుంకుమ సారే బహుకరించి సత్కరించారు. కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గ నాయకులు సామకోటి ఆదినారాయణ, జనసేన నాయకులు శివప్రసాద్, అబ్దుల్లా, సింగల్ విండో అధ్యక్షులు ముమ్మినేని వెంకట రాముడు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# సిఎం సభకు జనాలను తరలించడానికి ఆర్టీసి ఆర్‌ఎం ఆఫీసులో సమాలోచన

- వాహనాలు ఏరాట్లపై ఆర్‌ఎం, ఆర్టీఓలతో సమీక్ష



ఆర్టీసి ఆర్‌ఎం కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రులు, రవాణా అధికారులు

**అనంతపురం సెప్టెంబరు 06 ప్రభాతవార్త**

ఈ నెల 10న నగరంలో నిర్వహించనున్న సూపర్ సిక్స్, సూపర్‌హిట్ మహాసభకు హాజరౌతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జనాలను తరలించేందుకు రవాణా అధికారులతో రాష్ట్ర రవాణా శాఖామంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డితో పాటు మంత్రులు నారాయణ, గొట్టిపాటి రవికుమార్, ఆర్టీసి జోనల్‌చైర్మన్ పూలనాగరాజు తదితరులు ఆర్టీసి ఆర్‌ఎం కార్యాలయంలో శనివారం రాత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ రవాణాధికారి శ్రీలక్ష్మి, పుట్టపర్తి జిల్లా రవాణాధికారి మధుసూదన్, డిప్యూటి సిటిఎం రమేష్‌బాబు తదితరులతో నగరంలోని ఆర్టీసి రీజనల్ మేనేజర్ కార్యాలయంలో దాదాపు రెండు గంటలపాటు మంత్రులు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు ప్రధానంగా ముఖ్యమంత్రి హాజరౌతున్న సభకు ప్రజలు తరలించడానికి అధికారులు తీసుకోవాల్సిన ఏర్పాట్లపైనే ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది.

# సూపర్‌సిక్స్-సూపర్ హిట్ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జిల్లా తెలుగుదేశం కార్యదర్శి వైబి.మల్లికార్జున

బెలుగుప్ప, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

బెలుగుప్ప మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ అధికారి లక్ష్మీనారాయణ, తహశీల్దారు అనీల్‌కుమార్, మండల ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్‌సిక్స్-సూపర్ హిట్ ప్రజలు అధిక సంఖ్యలో స్వచ్ఛంతంగా తరలి వెళ్లి విజయవంతం చేయాలని, జన సమీకరణ కూడా అధికారులు బాధ్యత చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దన్న, మండల కన్వీనర్ ప్రసాద్, పెద్దతిప్పయ్య, మాజీ వైస్ ఎంపిపి తిమ్మప్ప, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వాట్సప్ సేవలు సద్వినియోగం చేసుకోండి

### సర్పంచ్ మల్లెల వనిత మల్లికార్జున



వాట్సాప్ సేవలపై అవగాహన చేస్తున్న దృశ్యం

బ్రహ్మ సముద్రం సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

బ్రహ్మసముద్రం మండలం సంతే కొండాపురం గ్రామపంచాయతీ యందు సర్పంచ్ మల్లెల వనిత ఆధ్వర్యంలో వాట్సప్ గవర్నెన్స్ కార్యక్రమం గురించి మూడు గ్రామాల యందు ఇంటింటి తిరిగి వాట్సప్ సేవల ద్వారా ప్రభుత్వ పథకాల గురించి ప్రతి వీధి నుండి ప్రతి ఇంటికి పోయి సచివాల సిబ్బంది తెలియజేయడం జరిగినది ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిత వెటర్నరీ అసిస్టెంట్ ప్రియాంక వెల్ఫేర్ అసిస్టెంట్ హనుమంతు మహిళా పోలీస్ శ్రీదేవి ఏఎన్ఎం మల్లేశ్వరి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## మస్జిదే అహ్మద్ రాజా ఆధ్వర్యంలో రక్తదానశిబిరం

రాయదుర్గం సెప్టెంబర్ 06 ప్రభాతవార్త



రక్త దాన దృశ్యం

శనివారం పట్టణంలో ఆత్మకూరు వీధిలో మస్జిదే అహ్మద్ రజా కమిటీ ఆధ్వర్యంలో మీలాద్ బ్లడ్ డొనేషన్ క్యాంప్" నిర్వహించారు ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు కులమతాలకు అతీతంగా అధిక సంఖ్యలో పాల్గొని తమ విలువైన రక్తాన్ని దానం చేశారు.ఈ సందర్భంగా మస్జిద్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ షఫీ మాట్లాడుతూ – "ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జన్మదినం సందర్భంగా మానవ సేవకు ప్రాధాన్యత ఇస్తూ, ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశాము. సమాజంలోని ప్రతి ఒక్కరి సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతమైంది. రక్తదానం మహత్తరమైన దానం, ఇది ప్రాణాలను కాపాడే పవిత్రమైన సేవ" అని పేర్కొన్నార ఈ రక్తదాన శిబిరంలో ఆ రక్తాన్ని బళ్ళారి విమ్స్ ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ షఫీ కార్యదర్శి హబీబుర్రహ్మాన్ సభ్యులు ఫైజుల్లా, హబీబ్, అల్లాబకాష్, ఏపీఎన్జీవో అధ్యక్షులు లక్ష్మీనారాయణ, రెడ్ క్రాస్ సొసైటీ మెంబర్ వీరన్న మానవతా సేవా సంఘం కన్వీనర్ అమర్నాథ్ రెడ్డి, కో కన్వీనర్ సలీం మలిక్,ఖాజీ మొహమ్మద్ సైఫుల్లా, బ్రెడ్ సర్మస్, అహ్మద్,రఫీక్, నిజాముద్దీన్, అబుబక్కర్, మహమ్మద్, రిపోర్టర్ ఖాజా, నజీర్, ఇనాయత్, ఇబ్రహీం మరియు అహ్లే సున్నత్ వ జమాత్ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న శ్రీధర్

కళ్యాణదుర్గం టౌన్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త



సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు పురస్కారాన్ని అందుకుంటున్న శ్రీధర్

కళ్యాణ్ దుర్గం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తున్న శ్రీధర్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార అవార్డును అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , మంత్రి లోకేష్ చేతుల మీదుగా ఈ అవార్డును ప్రధానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార్ అవార్డు ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. చదువుకున్న కళాశాల నుంచి అధ్యాపకునిగా ఉత్తమ అవార్డు అందుకోవడం ఎంతో గర్వంగా ఉందని శ్రీధర్ పేర్కొన్నారు. ప్రిన్సిపల్ హర్ష లత , కళాశాల అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

## గణపతి బప్పా మోరియా... నిమజ్జనానికి తరలిన వినాయకుడు.

### ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు యువత.

రొద్దం. సెప్టెంబర్ 6 ప్రభాతవార్త.



వినాయక చవితి పురస్కరించుకొని గ్రామంలో వాడ వాడల కొలువుదీరిన వివిధరూపాల గణనాథులు 11 రోజులుగా విశిష్ట పూజలు గావించి హోమాలు అభిషేకాలు ప్రత్యేక పూలంకరణ గావించి టీచ్ కాన్వెంట్ మదర్ టెక్నో ప్రాథమిక పాఠశాల వివిధ స్కూళ్ల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు సుబ్బరాయ ప్పగారికొట్టాలచే చెక్కభజన కార్యక్రమాలు ఇలా ఒకరోజు ఒక ప్రత్యేకత ఉండే విధంగా కమిటీ సభ్యులు ఏర్పాటు చేసి గ్రామ ప్రజలకు కనువిందుగా కార్యక్రమాలు చేపట్టారు ఉదయం లడ్డు వేలం తర్వాత పూలహారం నోట్ల హారం వేలం వెయ్యగా నోట్ల హారాన్ని గంగాధర్ 35 వేల రూపాయలకు దక్కించుకున్నాడు పూలహారాన్ని కే లింగమయ్య 4 800కు దక్కించుకోవడం జరిగింది అనంతరం ఊరేగింపు చిన్న ఆంజనేయస్వామి బ్యాంకు వీధి చిన్నయ్య సర్కిల్ వైఎస్ఆర్ సర్కిల్ పాత ఎస్సీ కాలనీ పోలేపల్లి వీధి కర్రన్న వీధి మీదుగా గణనాథుని నిమజ్జన్న కార్యక్రమం సాగింది కార్యక్రమంలో గ్రామ ప్రజలు మహిళలు యువత పెద్ద ఎత్తున పాల్గొని డిజె శబ్దాలకు నృత్యాలు చేశారు కమిటీ సభ్యులు ప్రతి సర్కిల్లోన రంగురంగుల బాణాసంచ పేల్చుతూ ఉత్సాహన్ని నింపడం జరిగింది.

# విద్యార్థి దశ నుండే చట్టాలపై అవగాహన అవసరం



చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం ఇంచార్జ్ హెచ్ఎం

డి.హిరెహాళ్ సెప్టెంబరు 6 ప్రభాతవార్త

విద్యార్థులు విద్యార్థి దశ నుండే చట్టాలపై అవగాహన పెంచుకోవడం ఎంతో అవసరమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు అమర్నాని పిలుపునిచ్చారు. శనివారం డి.హిరెహాళ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు సంకల్ప కార్యక్రమం నిర్వహించి పలురకాల చట్టాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. పిల్లలకు లింగ వివక్షత, పోషణ, ఆరోగ్యం , సైబర్ క్రైమ్ , మహిళా చట్టాలు విద్యా ప్రాముఖ్యత లాంటి పలు అంశాలపై సూచనలు చేశారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని 18 సంవత్సరాలు నిండక ముందే వివాహం జరిగితే కలిగే అనార్థాలు గురించి వివరించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగతపరిశుభ్రత విధిగాపాటించాలని దీంతో ఆరోగ్యవంతమైన జీవనం సాగించడం సాధ్యమవుతుందని పరిశుభ్రత ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు తెలియపరిచారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 8, 9, 10 తరగతుల బాలికలకు సంకల్ప కార్యక్రమం ద్వారా వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జెడ్పిటిసి శ్రీమతి హసీనా భాను, మండల వైసీపీ మైనార్టీ నాయకుడు శ్రీ రెహమతుల్ల, ఎం.ఈ.ఓ వేణుగోపాల్, ఐసిడిఎస్ సూపర్వైజర్ డి. ఉమారాణి, ఎంఎస్కే శ్వేత, చాంమీనిభాయి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి మాల వేశానంటూ ప్రజలను బెదిరిస్తూ వసూలు చేస్తున్న దొంగ స్వామి

కనేకల్లు సెప్టెంబర్ 06 ప్రభాతవార్త

నల్లచొక్కా నల్ల లుంగీ ధరించి మెడలో మాల వేసుకుని నుదుటిన గంధం బొట్టుపెట్టుకుని నేను అయ్యప్ప స్వామి మాల వేసుకున్నానని దేవాలయంలో అన్నదానం చేస్తున్నామని డబ్బులు ఇవ్వాలని ఇవ్వని వాళ్ళని బెదిరిస్తూ నాన బూతులు తిడుతూ ప్రజలవద్ద తన్నులుతిన్న దొంగ స్వామి కనేకల్ మండల కేంద్రంలో రామనగర్ మరియు బస్టాండ్ వీధిలో డబ్బులు ఇవ్వాలంటూ దబాయిస్తున్న వీడిని కొంతమంది పట్టుకుని మాల తీయించి దేహశుద్ధి చేశారు. ఈ దొంగ స్వామి ఒక అయ్యప్ప స్వామి మాలే కాక సాయిబాబా వివిధ దేవుళ్ళ బట్టలు ధరించి మాలలు ధరించి అన్నదానం జరిపిస్తున్నామని 21 రూపాయి కంపల్సరిగా ఇవ్వాలని లేకుంటే మీకు ఆ దేవుడు అరిష్టము కలిగిస్తాడని. ప్రజల్ని భయబ్రాంతలు చేస్తూ డబ్బులు దండకుంటున్నాడు. తీరా చూస్తే 30 సంవత్సరాలు లేవు మంచి యవ్వనంలో ఉన్నాడు పని పాట చేసుకునేకి ఏం మాయ రోగం ఇలాంటి వాళ్లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకూడదని ఎక్కడైనా దేవుళ్ళ పేరు చెప్పి బట్టలు వేసుకుని మాల వేసుకుని కనిపిస్తే దేహశుద్ధి చేయాలని కనేకల్ అయ్యప్ప స్వామి కమిటీ వారు ప్రకాష్ శివ నాగభూషణం నాగప్ప తదితరులు తెలిపారు. ఇలాంటి వాళ్ల పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని. పోలీసులకు కూడా అర్జీ ఇవ్వనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. గత మూడు రోజుల క్రితం ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర గుడి గుండ్ల గంగాధర వారి ఇంటి వద్ద శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో అన్నదానం చేపిస్తున్నామని రూ.21లు ఇవ్వాలని లేదంటే మీకు ఆ స్వామి నానా బాధలు పెడతారని అనడంతో తిట్టి పంపించారు. అలాగే ఉరవకొండ రోడ్డు చిన్న నాగల కట్ట వద్దగా కూడా ఇలాగే జరిగింది ఇలా అప్పనంగా ప్రజల సొమ్మును దోచుకుంటున్న ఇలాంటి దొంగస్వాములను ప్రజలు ఎక్కడకక్కడ నిర్బంధించాలి అని అయ్యప్ప స్వామి కమిటీ వారు కోరుతున్నారు.

## కుల ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు ప్రజలు సహకరించాలి -తహశీల్దార్

గుంతకల్లు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ రమాదేవి

కుల ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని తహశీల్దార్ రమాదేవి అన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా, వారి సౌకర్యార్థం ప్రభుత్వం సుమోటో కింద కులధృవీకరణ పత్రాలు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటిదాకా అర్బన్ పరిధిలో 23,326, రూరల్ పరిధిలో 7,876 మొత్తం 31,202 పత్రాలను స్వీకరించడం జరిగిందన్నారు. ఇందులో 4,839 కుల ధ్రువీకరణ పత్రాలను పూర్తి చేసి ఆన్‌లైన్‌లో వుంచామన్నారు. సుమోటోగా స్వీకరించిన పత్రాలపై విఆర్ఒలు పరిశీలనకు వెళతారని ప్రజలు వారికి సహకరించాలని కోరారు. సెప్టెంబర్ 15లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు విధించిందని పేర్కొన్నారు. అలాగే ప్రతి సోమవారం కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మండల స్థాయి అధికారులు కూడా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. అధికారులు కార్యక్రమానికి హాజరు కావాలని ఆమె కోరారు.

## గుత్తిలో వార్డు సచివాలయం ఉద్యోగుల నిరసన



సచివాలయం ఉద్యోగులు నిరసన తెలుపుతున్న దృశ్యం

గుత్తి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శనివారం వార్డ్ సచివాలయం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట గాంధీయ పద్ధతిలో నిరసన తెలిపారు. రాష్ట్ర విలేజ్ మరియు వార్డ్ గ్రామ సచివాలయాల సిబ్బంది జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు వారు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తమ న్యాయ సమ్మతమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినా ఫలితం లేదన్నారు. తమ ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవడానికై, తాము వాలంటీర్లు నిర్వహించే విధులను చేయబోమన్నారు. అదేవిధంగా డోర్ టు డోర్ సర్వే, క్లస్టర్ మ్యాపింగ్ తదితర విధులను తమకు అప్పగించరాదని, ఉద్యోగ భద్రతతో పాటు ప్రమోషన్ కల్పించాలని వారు కోరారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ జబ్బార్‌మియాకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో వినయ్, కమలేష్, సుమలత, మురళీకృష్ణ, చంద్రకళ, జయశ్రీ, రాణి, వెంకటేష్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

# వ్యాధిగ్రస్తునికి ఆర్థిక సాయం

లేపాక్షి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త



ఆర్థికసాయం అందచేస్తున్న టిడిపి నాయకులు

మండల కేంద్రమైన లేపాక్షి ఎస్‌సి కాలనీకి చెందిన నరసింహమూర్తి దీర్ఘకాలవ్యాధి తో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకున్నా ఆరోగ్యం కుదుటపడలేదు. దీంతో విషయాన్ని టిడిపి మండల కోఆర్డినేటర్ జయప్ప, మాజీ ఎంపిపి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు ఆర్థిక సాయాన్ని అందచేసిన్నట్టు వారు తెలిపారు. శనివారం బాధితుని ఇంటికి వెళ్లి 60 వేల రూపాయలను అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే మండలంలో పలువురికి ఆర్థిక సహకారాన్ని అందచేశామన్నారు. తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు కష్టాలు వుంటే ఆదుకున్న సంఘటనలు ఎన్నో వున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అంగడి అంజి, రమేష్, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు లేపాక్షి ఆలయం మూసివేత

లేపాక్షి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

ప్రముఖ పర్యాటక క్షేత్రమైన లేపాక్షి శ్రీవీరభద్రస్వామి ఆలయాన్ని ఆదివారం 12 గంటలకు మూసి వేస్తున్నట్టు ఆలయ కార్య నిర్వహణ అధికారి నరసింహమూర్తి తెలిపారు. ఆదివారం రాత్రి చంద్రగ్రహణం కారణంగా ఆలయాన్ని మూసి వేస్తున్నామన్నారు. సోమవారం ఉదయం 7 గంటలకు ఆలయం శుద్ధి చేసిన తరువాత అర్చకులు లక్ష్మీనరసింహాశర్మ, శ్రీనివాస్‌కుమార్‌లు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు ఆలయ దర్శనం కల్పిస్తామని పేర్కొన్నారు.

## కెవిఆర్ ను సత్కరించిన ఎల్.ఆర్. జి.అధినేత

హిందూపురం టౌన్ సెప్టెంబర్ 6 ప్రభాతవార్త



సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం సమీపంలో ఉన్న ఎల్.ఆర్.జి. పబ్లిక్ స్కూల్ లో ఇటీవలే నూతనంగా నిర్మించిన స్కూల్ భవనం ప్రారంభోత్సవానికి సీనియర్ నాయకులు కొండూరు వేణు గోపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కె.వి.ఆర్‌ను విద్యా సంస్థల ఛైర్మన్ సుమంత్ రామ్మూర్తి, సెక్రటరీ బాల సుందరం. సన్మానించారు. హిందూపురం ప్రాంతంలో ఎల్ఆర్ జి సంస్థ దశాబ్దాలుగా అందిస్తున్న వైద్య సేవలను కెవిఆర్ కొనియాడారు.


## ప్రశాంత నిలయంలో ఘనంగా రేడియో సాయి 24వ వార్షికోత్సవం

పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు


ప్రశాంత నిలయంలో శ్రీ సత్యసాయి మీడియా కేంద్రమైన రేడియో సాయి 24వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ రేడియో సాయి సోషల్ మీడియా ప్రసార మాధ్యమాల ద్వారా శ్రీ సత్య సాయి సందేశాన్ని విశ్వవ్యాప్తం చేశారు. సత్య సాయి బాబా 76వ పుట్టినరోజు సందర్భంగా రేడియో సాయి గ్లోబల్ హార్మోనిని బాబా ప్రారంభించారు. ప్రారంభించిన అనంతరం 2002 ఆగస్టు 29 బాబా ఈ కేంద్రాన్ని సందర్శించి , స్టూడియో అవసరమైన పరికరాలను అందజేశా రు. ఈ కేంద్రం ద్వారా సత్యసాయి బాబా కి జ్ఞానాన్ని కోట్ల మందికి అనేక స్ట్రీమ్ ల ద్వారా విభిన్న భాషలలో ప్రసారం చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని పిల్లలు మహిమ తీన్ అనే ఆకర్షణ ఏమైనా కృత్యంతో ప్రారంభించడం జరిగింది. అనంతరం భగవాన్ ప్రసంగాలను ప్రేరణ ఇచ్చిన చమత్కార సంస్కార పరోపకారం సాక్షాత్కారు పేరుతో వీడియో ను ప్రసారం చేయడం జరిగింది. మనిషి జీవితంలోని వివిధ దశలను ప్రతిబింబిస్తూ రచించిన గ్రంధాన్ని మేనేజింగ్ ట్రస్టీ ఆర్జె రత్నాకర్, గ్లోబల్ కౌన్సిల్ అధ్యక్షులు చక్రవర్తి, రేడియో సాయి డైరెక్టర్ సుందర స్వామినాథన్ తో కలిసి ప్రారంభించారు. తిరిగి సాయంత్రం రేడియో సాయి ప్రతినిధులు అద్భుతమైన సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది అనంతరం మంగళ హారతితో కార్యక్రమంలో కార్యక్రమం ముగిసింది ఈ కార్యక్రమంలో వందలాది మంది దేశ విదేశీ భక్తులు పాల్గొన్నారు.



సంగీత కచేరి నిర్వహిస్తున్న రేడియో సాయి సభ్యులు.

## కార్పోరేట్ సెలూన్ షాపులను వెంటనే తొలగించాలి

గుంతకల్లు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న రజక సంఘం రాష్ట్ర నాయకులు దేవేంద్రప్ప

పట్టణంలో ఏర్పాటు చేసిన కార్పోరేట్ సెలూన్ షాపులను వెంటనే తొలగించాలని క్షవర వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ బి. శ్రీనివాసులు, రజక సంఘం రాష్ట్ర నాయకులు దేవేంద్రప్ప, కాటికాపర్ల సంఘం రాష్ట్ర నాయకులు జగ్గలి రమేష్, సంచార జాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సంచారజాతుల సంఘం కార్యాలయంలో "కార్పోరేట్ సెలూన్స్ సాంప్రదాయ క్షవర వృత్తిదారులపై ప్రభావం" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పట్టణ నాయిబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ 1991లో వచ్చిన నూతన ఆర్థిక విధానాల వల్ల చేతివృత్తులు నాశనమవుతున్నాయన్నారు. 2000 ఏడాదిలో సెలూన్ పరిశ్రమగా ప్రారంభమై, 2010 నాటికి కార్పోరేట్ సంస్థలు ఇందులోకి చొరబడ్డాయన్నారు. ఇతర కులాలు, మతాలవారు ఈ వృత్తిలోకి ప్రవేశించి కార్పోరేట్ సెలూన్లు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న క్షవరవృత్తిదారులు కుటుంబ పోషణ భారమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రజా ప్రతినిధులు స్పందించి పట్టణంలో నిర్వహిస్తున్న కార్పోరేట్ సెలూన్లను వెంటనే తొలగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం పట్టణ అధ్యక్షులు ఎల్లప్ప, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కేవెల్ స్వామిదాస్, ఎస్‌సి, ఎస్‌టి నాయకులు జెన్నీ మస్తాన్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కసాపురం రమేష్, పట్టణ కార్యదర్శి సురేంద్ర, నాయకులు తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీల ఆదాయం సరికొత్త రికార్డు..!

-కేవలం 110 రోజులకు రూ.33.75 లక్షలు సమకూరిన ఆదాయం

-గతానికి భిన్నంగా ఆరుబయట కొనసాగిన హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న ఇంచార్జ్ ఈవో సి.ఎన్.తిరుమలరెడ్డి తదితరులు

ఉరవకొండ, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

ఉరవకొండ మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీల కానుకల ఆదాయం ఆలయ చరిత్రలో రికార్డు స్థాయిలో 33,75,028 రూపాయలు సమకూరింది. గత మే 20వతేదీనుండి భక్తులు 110 రోజుల్లో శ్రీవారికి, కొండ కింద ఉద్భవలక్ష్మి అమ్మవారికి హుండీల ద్వారా సమర్పించిన కానుకలు, ముడుపులను ఆలయ ఆలయ కార్యనిర్వహణ అధికారి సి.ఎన్.తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో కర్నూల్ డిప్యూటీ కమీషనర్ కార్యాలయం జూనియర్ సహాయకులు ఎం.మహేష్, అప్రేజర్ జేవీవో మాధవస్వామి పర్యవేక్షణలో శనివారం లెక్కించారు. హుండీల్లో నగదుతోపాటు 12 గ్రాముల 900 మిల్లీ గ్రాములు బంగారం, 697 గ్రాముల వెండి వచ్చిందని ఈవో తెలిపారు. కాగా గతానికి భిన్నంగా ఈసారి ఆలయ ప్రాంగణం బహిరంగ ప్రదేశంలో హుండీ లెక్కింపు నిర్వహించడం విశేషంగా చెప్పాలి. హుండీ లెక్కింపు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రేగటి నాగరాజు, మోపిడి గోవిందు, ఆమిద్యాల రామాంజినేయులు, దబ్బర గోపాల్, పెద్దముష్టూరు రామకృష్ణ తదితరులతోపాటు బళ్లారికు చెందిన వీరభద్రస్వామి సేవా సమితి అధ్యక్షులు రాజశేఖర్ బృందం, అనంతపురం ఫస్ట్ రోడ్డు శివాలయం సేవా సమితి సభ్యులు, ఉరవకొండ పోలీస్ స్టేషన్, కెనరా బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## త్రాగే హెచ్.ఎల్.సి నీటి కాలువలో లెట్రిన్ నీరు ..

### మాట్లాడుకుని మరీ వేసేందుకు సిద్ధమయ్యారు

కనేకల్లు సెప్టెంబర్ 6 ప్రభాతవార్త



హెచ్ఎల్‌సి కాలువలోకి లెట్రిన్ నీరు వదిలిన పైపులు

కనేకల్ మండల కేంద్రంలోని రామనగర్ హెచ్ఎల్సీ మెయిన్ కాలవలోకి ఇందిరమ్మ కాలనీ నుండి అనేకమంది లెట్రిన్ మరియు బాత్రూంలో నుండి దుర్వాసన వెదజల్లే నీరు కాలవ లోకి పైపులు ద్వారా వదిలారు. అధికారులు సంవత్సరం తర్వాత వాటిని రోడ్డు నుండి కాలవ లోకి వేసిన పైపులు మాత్రం తొలగించారు. అధికారులు పైపులు తొలగించడంతో స్థానికులు ఆగ్రహం చెందారు. గతంలో, హెచ్ ఎల్ సిబ్బందికి మామూలు ఇచ్చి పైపులు వేసుకున్నమని ఎందుకు తొలగించారంటూ ఆవేదన వ్యక్తపరిచినట్లు స్థానికలు తెలిపారు. రాజకీయ రంగ ప్రవేశం చేశాక అధికారులు మరల హెచ్.ఎల్.సి మెయిన్ కాలవలోకి లెట్రిన్ బాత్రూం నీళ్ల పైపులను వేయించేందుకు సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. ఈ పైపులు వేసేందుకు డబ్బులు కూడా వసూలు చేసినట్లు ఆరోపణలు వెలబడుతున్నాయి హెచ్.ఎల్.సి నీరు చాలామంది త్రాగడానికి ఉపయోగిస్తున్నారు ఇలాంటి త్రాగే నీటిలో లెట్రిన్ నీరు వదలడం ఎంత వరకు సమంజసం అని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హెచ్.ఎల్.సి కాలవలోకి లెట్రిన్ పైపులు నీరు వదలకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుచున్నారు.

## వడ్డెర్ల పూల వర్షంలో మంత్రి సవితమ్మ పునీతం

-వడ్డే వెంకట్, పల్లపు మహేంద్ర ఆధ్వర్యంలో మంత్రి సవితమ్మను ఘనంగా సత్కరించిన గోరంట్ల మండల వడ్డెర్లు

-గోరంట్ల మండలంలో సింగిల్ విండో, మార్కెట్ యార్డ్ కమిటీలలో స్థానం కల్పించడంపై హర్షం

గోరంట్ల, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

గోరంట్ల మండలంలోని వడ్డెర్లను గుర్తించి పలు నామినేటెడ్ పదవులలో స్థానం కల్పించిన రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత జౌళిశాఖా మంత్రి సవితమ్మను శుక్రవారం పెనుకొండ పట్టణం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ వడ్డెర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్ ఆధ్వర్యంలో గోరంట్ల మండల వడ్డెర్లు ఘనంగా సత్కరించారు.



మంత్రి సవితమ్మను ఘనంగా సన్మానిస్తున్న వడ్డెర్లు

మంత్రి సవితమ్మను గజమాలతో సత్కరించి పూల వర్షం కురిపించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న వడ్డెర్లను గుర్తించడంపై గోరంట్ల మండల వడ్డెర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల మండల వడ్డెర సంఘం అధ్యక్షుడు కడప రామాంజి, గౌనివారిపల్లి సింగిల్ విండో ప్రెసిడెంట్ రవిమోహన్, గోరంట్ల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వడ్డే అమరనాథ్, తెలుగుదేశం పార్టీ వడ్డెర సాధికార సమితి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ పెనుకొండ పల్లపు మహేంద్ర, రెడ్డిచెరువుపల్లి మాజీ సర్పంచు నిడిమామిడప్ప, సర్పంచు వినోద్‌కుమార్, వడ్డే శ్రీనివాస్, శిరగవాండ్లపల్లి వెంకటరమణప్ప, ఆనంద్, రవికుమార్, ఎర్రబల్లి లక్ష్మీనారాయణ, సాయిప్రసాద్, కమ్మలవాండ్లపల్లి రఘు, జరిపిటి హనుమన్న, బుదిలివాండ్లపల్లి బాలకృష్ణ, వెంకటరమణపల్లి గంగాధరప్ప, సోమశేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న మండల వడ్డెర్లు

## ఘనంగా గురుపూజోత్సవం

గుడిబండ సెప్టెంబర్ 6 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం గురుపూజోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ క్రమంలో ఉపాధ్యాయులకు ఆటలపోటీలు నిర్వహించి విజేత లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోవిందప్ప, పిఈటి అజరుద్దీన్,ఉపాధ్యాయులు రామచంద్రప్ప, గంగాధర్, రమేష్, వసుంధర, జ్యోతి, నిర్మల,కృష్ణవేణి,ముకుంద,నాగమణి విద్యార్థిని విద్యార్థులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



గురుపూజోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

03ATP06_03ATP06.qxd 06-09-2025 PM 11:07 Page 1



# సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభ విజయవంతం జనసేన బాధ్యత

**- ఉమ్మడి అనంతపురం జిల్లా జనసేన సమన్వయ సమావేశంలో దిశా నిర్దేశం చేసిన జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్**



సమావేశంలో మాట్లాడుతున్న అహుడ చైర్మన్ టిసి వరుణ్

**అనంతపురం వైద్యం సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం ఈనెల 10వ తేదీన అనంత వేదికగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సూపర్ సిక్స్.. సూపర్ హిట్ బహిరంగ సభలో జన సునామీని సృష్టించాలని జనసేన జిల్లా అధ్యక్షులు, అర్బన్ నియోజకవర్గం ఇంచార్జ్, అహుడ చైర్మన్ టీసీ వరుణ్ పిలుపునిచ్చారు. శనివారం అనంతపురం యాదవ భవన్ లో ఉమ్మడి అనంతపురం జిల్లా సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీసీ వరుణ్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రాయలసీమ వ్యాప్తంగా జన సైనికులు ఉప్పెనలా తరలిరావాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రధాన ఆరు హామీలను దిగ్విజయంగా అమలు చేస్తూ నిర్వహిస్తున్న ఈ సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభను విజయవంతం చేయడం జనసేన బాధ్యత. అనంతపురం జిల్లాలోని ప్రతి నియోజకవర్గ, ప్రతి మండలం నుండి భారీ సంఖ్యలో జనసైనికులు తరలిరావాలన్నారు. ప్రతి డివిజన్ నుండి 1000 మంది తరలి రావాలని పిలుపునిచ్చారు. నగర కమిటీ నాయకులు సూపర్ హిట్ సభ విజయవంతమే లక్ష్యంగా పనిచేయాలని జనసేన నగర కమిటీ సమన్వయ సమావేశంలో టీ.సీ.వరుణ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ లు అంకె ఈశ్వరయ్య, కాయగూరల లక్ష్మీపతి, మొబలైజేషన్ కమిటీ సభ్యులు అతికారి కృష్ణ, పత్తి చంద్రశేఖర్, ట్రాన్స్పోర్ట్ ఫుడ్ కమిటీ సభ్యులు సుంకర శ్రీనివాస్, భవాని రవికుమార్, వెన్యూ మానిటరింగ్ కమిటీ సభ్యులు చింతా సురేష్ బాబు, పొదిలి బాబురావు, కంట్రోల్ రూమ్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు తాతంశెట్టి నాగేంద్ర, వాసగిరి మణికంఠ, పార్కింగ్ కమిటీ సభ్యులు ఫోర్సు మహేష్, కుమ్మర నాగేంద్ర నియోజకవర్గ ఇన్చార్జిలు, జిల్లా, నగర కమిటీ సభ్యులు, మండల అధ్యక్షులు, నాయకులు, వీరమహిళలు, జనసైనికులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# లక్ష్యాలను కాల వ్యవదిలోపు పూర్తి చేయండి

**- ఏడిసిసి అధికారులకు ఆదేశించిన ఆప్కాబ్ చైర్మన్**



సమావేశంలో మాట్లాడుతున్న ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు

**అనంతపురం వైద్యం సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**

ఈ ఏడాది నిర్దేశించిన లక్ష్యాలను కాల వ్యవధిలో పూర్తి చేసి బ్యాంకు అభివృద్ధిలో పాలు పంచుకోవాలని ఏడీసీసీ అధికారులకు ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు ఆదేశించారు శనివారం జిల్లా పర్యటనలో భాగంగా ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డితో కలిసి బ్యాంకు అధికారులు ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా బ్యాంక్ చైర్మన్ శ్రీ కేశవరెడ్డి గారు మాట్లాడుతూ 202526 సంవత్సరానికి గాను బ్యాంకు రూ. 2500 కోట్ల రూపాయలు వ్యాపార లక్ష్యంగా పెట్టుకున్నామని ఇందులో రూ.650 ఓట్లు డిపాజిట్ల సేకరణ చేయాలని ఉద్దేశించుకున్నామని ఆప్కాబ్ చైర్మన్‌కు తెలిపారు. 1997 సంవత్సర మునుపు మొండి బకాయిలను ఓటీఎస్ పరిధిలోకి తీసుకురావాలని, చేనేత సంఘాల రుణమాఫీ పథకాన్ని అమలు చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. అనంతరం ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ అనంతపురం డీసీసీబి కి అప్కాబ్ ప్రత్యేకంగా అన్ని రకాలైన సహాయ సహకారాలు అందిస్తూ చేదోడు వాదోడుగా ఉంటుందని తెలిపారు. ఓ టి ఎస్, చేనేతల రుణమాఫీకు ఆప్కాబ్ తరఫున రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయడం జరిగిందని ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాగానే ఓటీఎస్ చేనేతల రుణమాఫీ చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈవో సురేఖ రాణి డిజిఎంలు ఇతర సీనియర్ మేనేజర్లు పాల్గొన్నారు.

# అమెరికా భారత్‌పై విధించిన సుంకాన్ని తగ్గించాలి

**- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున**




ర్యాలీ నిర్వహిస్తున్న చిరుతల మల్లికార్జున తదితరులు

**రాప్తాడు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

రాష్ట్ర వామపక్షాల సమితి పిలుపుమేరకు రాప్తాడు మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి ఎం.రమేష్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున సిపిఎం జిల్లా సెక్రెటరియట్ మెంబర్ బాల రంగయ్య హాజరై మాట్లాడుతూ.. భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50 శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ప్రకటించడంతో మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడింది. ఆక్వా, టెక్స్టైల్స్, గార్మెంట్స్ వంటి ఉత్పత్తుల ధరలు ఘోరంగా పడిపోయాయి. మన దేశ ప్రయోజనాలు కాపాడేందుకు, సార్వభౌమత్వ పరిరక్షణ కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలబడాలని డిమాండ్ చేస్తూ, అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరుకొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమములో సిపిఐ మండల కార్యదర్శులు నరేష్, రవీంద్ర, బండారు శివ, రాప్తాడు మండల సహాయ కార్యదర్శి చలపతి, రాప్తాడు నియోజకవర్గ నాయకులు శ్రీకాంత్, రాకెట్ల రాము, అనంతపురం రూరల్ మండల నాయకులు రెడ్డప్ప, కుళ్లాయప్ప ప్రసాద్, నారాయణస్వామి, మహేష్, గోవిందు, సీపీఎం నాయకులు పోతులయ్య, పుష్పరాజ్, సుబ్బిరెడ్డి, సుబ్బారావు, ప్రతాప్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# హిజ్రాలకు ఉచిత శిక్షణ

**అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలోని హిజ్రలకు (ట్రాన్స్ జెండర్ )లకు 21వ సెంచరీ సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ సంస్థ వారు పోటీ పరీక్షలు, స్వయం ఉపాధి కొరకు నైపుణ్య అభివృద్ధి కోర్సులలో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడి అర్చన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ లెవెల్ కోర్సులో ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, కాంపిటీటివ్ ఇంగ్లీష్, బేసిక్ కంప్యూటర్ ప్రావీణ్యం, సాఫ్ట్ స్కిల్స్, పబ్లిక్ స్పీకింగ్, ప్రాక్టీస్ టెస్టులు, డిగ్రీ లెవెల్ కోర్సులో అడ్వాన్స్డ్ ఆప్టిట్యూడ్, న్యూస్పేపర్ అనాలిసిస్, వ్యక్తిత్వ అభివృద్ధి, పోటీ ఇంగ్లీష్,అడ్వాన్స్డ్ కంప్యూటర్ ప్రావీణ్యం ఉంటుందన్నారు. 10+2 ఉత్తీర్ణులు, 18-28 సంవత్సరాల వయస్సు, ఇంగ్లీష్, తెలుగులో ప్రాథమికంగా చదవడం, వ్రాయడం, డిగ్రీ స్టూడెంట్స్ తప్పనిసరిగా ఏదైనా స్ట్రీమ్‌లో గ్రాడ్యుయేషన్, 18-35 సంవత్సరాల వయస్సు ప్రభుత్వ ఐడి/ట్రాన్స్ జెండర్ సర్టిఫికేట్ ద్వారా ధృవీకరించబడిన ట్రాన్స్ జెండర్ కమ్యూనిటీకి చెందినవారు మాత్రమే అర్హులన్నారు.

# అరటిలో యాజమాన్య పద్దతులు పాటిస్తే అధిక దిగుబడు సాదించవచ్చు

**- ఉద్యానశాఖ అధికారి శైలజ**



రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

**బుక్కరాయసముద్రం, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త**

అరటి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాదించవచ్చునని ఉద్యానశాఖ అధికారి శైలజ అన్నారు. శనివారం బుక్కరాయ సముద్రం మండలపరిదిలోని రెడ్డిపల్లి గ్రామం నందు అరటి పంట సాగులో మెలకువలు, నాణ్యమైన దిగుబడి పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతితులుగా రేకులకుంట పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రహ్మణం పాల్గొని అరటి పంట సాగుల రకాలు వాటి ప్రాముఖ్యత టిష్యూకల్చర్ మొక్కల ఎంపిక సమగ్ర పోషక యాజమాన్యం, అరటిలో ప్రధాన తెగులు అయిన పిగేటోకా ఆకుమచ్చ తెగులు నివారనా చర్యలు గురించి వివరించారు. అనంతరం ఉద్యానఅధికారి శైలజ మాట్లడుతూ నాణ్యమైన కాయల దిగుబడి కొరకు బనానా ఫ్రూట్‌కేర్ ఆక్టివిటీ ప్రాముఖ్యత వివరించారు. ఈ పథకంకి సంబందించిన ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తుంది. కొత్తగా నాటుకున్న మామిడి, బొప్పాయి, దానిమ్మ, అంజూర, నేరేడు, జామ తోటలకు 40 శాతం సబ్సిడి ప్రోత్సాహం ఉద్యానశాఖ ద్వారా పొందవచ్చు, పంటకోత అనంతరం పంటలను నిల్వచేసుకోవడానికి కోల్డ్ రూములు సోలార్ డ్రైయూనిట్స్ 35 శాతం రాయితీతో రైతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే ఫ్రూట్‌కేర్ ఆక్టివిటీ కంపెనీ ప్రతినిధులు, కేవికె రెడ్డిపల్లి శాస్త్రవేత్తలు మాధవి, ఉద్యానసిబ్బంది విజయశాంతి, గుల్‌ఫరీష, ఓబులపతి గ్రామరైతులు పాల్గొన్నారు.

# రుద్రంపేట మెయిన్ రోడ్డు ప్రాంతాలు శుభ్రంగా ఉంచాలి

**- కార్మికులకు తెలిపిన గ్రేడ్ I పంచాయతీ కార్యదర్శి యు. హిదయతుల్లా**



కార్మికులకు సూచనలిస్తున్న కార్యదర్శి హిదయతుల్లా.

**అనంతపురం రూరల్, సెప్టెంబర్ 06 ప్రభాతవార్త**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనలో భాగంగా అనంత రూరల్ మండలం రుద్రంపేట గ్రామపంచాయతీ పరిధిలో హెలికాప్టర్ లో దిగి మెయిన్ రోడ్డు నుంచి సభ స్థలానికి చేరుకోవడం జరుగుతుందని కావున ఆయన పర్యటన సందర్భంగా రుద్రంపేట పంచాయతీలోని మెయిన్ రోడ్లు అన్ని పరిశుభ్రంగా ఉంచాలని అనంత అర్బన్ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, డిపిఓ, డి ఎల్ పి ఓ, ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో తెలియజేయడంతో కక్కలపల్లి క్లస్టర్ గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శి యు. హిదయ తుల్లా మెయిన్ రోడ్లన్నీ దగ్గరుండి పంచాయతీ కార్మికులతో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన సీఎం చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనకు వచ్చి పోయేంతవరకు రుద్రంపేట లోని మెయిన్ రోడ్లన్నీ ప్రతిరోజు శుభ్రం చేస్తూ ఆ ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్మికులకు తెలియజేశారు. పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని ఎంపీడీవో దివాకర్, డిప్యూటీ ఎంపీడీవో వెంకట నాయుడు, పంచాయతీ కార్యదర్శులు అయిన ప్రవీణ్ బాబు, అశోక్ కుమార్, సర్దార్ వలి, మల్లికార్జున, చరణ్ కుమార్ పాల్గొన్నారు.

# శ్రీవాణి డిగ్రీ, పిజి కళాశాలలో ఇ-కామర్స్‌పై శిక్షణ తరగతులు



శిక్షణకు హాజరైన విద్యార్థులు, శిక్షకులు, కళాశాల అధ్యాపకులు

**అనంతపురం కల్చరల్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

అనంతపురం కక్కలపల్లి మార్గ మద్యంలో ఉన్న శ్రీవాణి డిగ్రీ, పిజి కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు ప్రముఖ ఐటి కంపెనీ ఇన్ఫోసిస్ వారిచే ఇ-కామర్స్‌పై రెండు వారాలపాటు శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగింది. విధ్య, ఉపాధి మద్య అంతర్యాన్ని తగ్గించే కార్యక్రమంలో భాగంగా ఈ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఐసిటి అకాడమి అధినేత ఎస్.దినకర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు భావ ప్రసార నైపుణ్యాలు, అంతర్జాతీయ సంకేతాలపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. ఈ తరగతులకు రత్నకర్(టెక్నికల్), జగదీష్‌కుమార్ రాజు (సాఫ్ట్ స్కిల్స్), ఐసిటి అకాడమి నియమింపబడినట్లు తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనజమ్మ మాట్లాడుతూ.. ఇలాంటి శిక్షణ తరగతులు విద్యార్థుల ఉపాధి అవకాశాలకు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా ముగియడానికి కో-ఆర్డినేటర్ కె.నాగప్రమోద్‌కి, మెంటర్స్ బి.నర్మద, కె.స్వప్నకుమారికు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా అధ్యాపక అధ్యాపకేతర బృందానికి కూడా కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే అనుమతిచ్చిన మేనేజ్‌మెంట్, సిఎఓ, వైస్ ప్రిన్సిపాల్, పిజి ప్రిన్సిపాల్, ఎంబిఎ ప్రిన్సిపాల్ అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# పీవీకేకే ఐటీలో ప్రాంగణ నియామకాలు

**అనంతపురం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త బ్యూరో**

ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ ఎన్‌విహెచ్ ఇండియా ఆధ్వర్యంలో పూల్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ సెప్టెంబర్ 9వ తేదీ (మంగళవారం) ఉదయం 9 గంటలకు అనంతపురం లోని పివికెకె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.టెక్ మరియు డిప్లొమా విద్యార్థులకు అవకాశాలు కల్పించనున్నారు. ముఖ్యంగా మెకానికల్, ఈసిఇ, ఈఈఈ, ఆటోమొబైల్ విభాగాల నుండి 2020 నుండి 2025 వరకూ పాస్ అవుట్ అయిన విద్యార్థులు (పురుషులు మాత్రమే) అర్హులు. ఎంపికైన అభ్యర్థులకు సంవత్సరానికి రూ.2.2 లక్షల వేతనం తో పాటు బోనస్ కూడా అందించనున్నారు. అభ్యర్థుల ఎంపిక కోసం సంస్థ ఆన్‌లైన్ పరీక్ష, ముఖాముఖి ఇంటర్వ్యూ నిర్వహించనుంది. ఎంపికైన వారికి గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రైనీ, డిప్లొమా ఇంజినీర్ ట్రైనీగా పెనుకొండ సమీపంలోని అమ్మవారిపల్లి దగ్గర గల సంస్థలో నియమిస్తారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. బండి రమేష్ బాబు మాట్లాడుతూ..విద్యార్థులకు ప్రతిష్టాత్మక సంస్థల్లో అవకాశాలు కల్పించడానికి మా కళాశాల ఎల్లప్పుడూ ముందుంటుంది అన్నారు. కళాశాల చైర్మన్ డా. పల్లె కిషోర్ మాట్లాడుతూ..పివికెకె విద్యార్థులు వివిధ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు పొందుతున్నారు. ఈ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ద్వారా మా కళాశాల విద్యార్థులు మాత్రమే కాకుండా పరిసర ప్రాంతాల యువత కూడా లాభం పొందుతారు" అని పేర్కొన్నారు.

# సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభకు వేలాదిగా తరలిరండి

**- ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ**



సమావేశంలో మాట్లడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణీ, హాజరైయిన టీడీపి నాయకులు

**బుక్కరాయసముద్రం సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**



సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభకు వేలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ పిలుపునిచ్చారు. శనివారం బుక్కరాయసముద్రం పంచాయితీ సమీపంలోని షిడిసాయిబాబా కళ్యాణ మండపంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభకు సన్నాహక సభ సమావేశం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అథితులుగ గుంటూరు మేయర్ టీడీపి జోనల్ 5 ఇంచార్జి కోవెలముడి రవీంద్ర, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, అబ్జర్వర్ పర్వీన్‌తాజ్, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ బాబ్జి, ఎడిసిసి చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి రామలింగారెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిది ఆలం నరసానాయుడు, నియోజకవర్గంలోని 6 మండలాల నుండి టీడీపి నాయకులు, కూటమి శ్రేణులు తదితిరులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ మాట్లడుతూ ఈ నెల 10 తేదిన అనంతపురం నగరంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభా కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, బిజేపి రాష్ట్ర నాయకులు పాల్గొననున్నారు.

# ఫెర్టిలైజర్ దుకాణాలపై ఆకిస్మక తనిఖీలు



ఫర్టిలైజర్స్ దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

**అనంతపురం కలెక్టరేట్ సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

అనంతపురము ఉమ్మడి జిల్లా విజిలెన్స్ అండ్ ఎంఫోర్సుమెంట్ వైబిపిటిఏ. ప్రసాద్ ఆదేశాల మేరకు శ్రీసత్యసాయి జిల్లాలో ఎరువుల దుకాణాలలో తనిఖీలు నిర్వహించడమైనది. తనిఖీలలో ఎరువుల దుకాణాలలో భౌతిక నిలువలు, ఈ పాస్ మిషన్‌లో వున్న నిలువలతో పోల్చి చూసినపుడు స్వల్ప వ్యత్యాసాలు గుర్తించడం జరిగినది. ఇది క్లాస్ 3 , 4, ఎఫ్ సి ఓ యాక్ట్ , 1985 మేరకు 1.10 లక్షల విలువ గల వివిధ రకముల 3.00 మెట్రిక్ టన్నుల ఎరువులను తాత్కాలికంగా అమ్మకం నిలుపుదల చేయమని సంబంధిత వ్యవసాయాధికారుల ద్వారా నోటీసు ఇవ్వడం జరిగినది. యూరియాను కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు అమ్మడం, స్టాకు వున్నా నో స్టాక్ బోర్డు పెట్టడం లాంటివి చేసి రైతులకు ఇబ్బందులు గురిచేసిన ఎడలా సంబదిత బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోబడును అని ప్రాంతీయ నిఘా అధికారి ప్రసాద్ హెచ్చరించారు.

**అగ్రికల్చర్ అధికారుల నిర్లక్ష్యం**

ఉమ్మడి జిల్లాలలో విస్తృతంగా అగ్రికల్చర్ అధికారులు ప్రతి మండలంలోని ప్రతిరోజు పర్యవేక్షణ చేస్తున్నటువంటి తరుణంలో ఎలా ఈ ఏరియా ఎలా అక్రమదారులు అమ్మకాలు సాగిస్తున్నారని అగ్రికల్చర్ అధికారులు ప్రభుత్వానికి సమాధానం చెప్పాలి. అక్రమ ఎరువుల అమ్మకాలపై నిర్లక్ష్య ధోరణిలో అగ్రికల్చర్ అధికారులు ఉండటం ఏమిటి. ఈ ప్రశ్నకు ప్రతి ఒక్క అధికారి సమాధానాలు ఇవ్వాలి. ప్రతిరోజు విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఫర్టిలైజర్స్ దుకాణాలపై దాడులు చేస్తూ లక్షల రూపాయలు ఎరువులు అక్రమదారులు పెట్టడం పసికట్టి కేసులు పెడుతున్నారు ఇప్పటికైనా అగ్రికల్చర్ అధికారులు అక్రమదారులు ఎరువులు అమ్మకాలను అరికట్టి రైతులకు న్యాయం చేయాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. డిఎస్పి. ఎం.నాగభూషణం; సీఐ కే. శ్రీనివాసులు, వ్యవసాయ అధికారి: జే. వాసు ప్రకాష్; విజిలెన్సు సిబ్బంది మరియు స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# చీనీ రైతులకు చీనీ పాతతోటల పునరుద్దరణపై అవగాహన సదస్సు



రైతులతో మాట్లాడుతున్న హార్టికల్చర్ అధికారులు

**శింగనమల, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

మండల పరిధిలోని వెస్ట్ నర్సాపురం రైతు సేవా కేంద్ర పరిధిలోని నాగలగుడ్డం తాండ గ్రామ చీనీ రైతుల తోటల పునరుద్దరణ, తెగులు, చీడ పీడల నివారణ చర్యలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉద్యాన పరిశోధన స్థానం రేకుల కుంట ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చీనీలో రకాలు సద్గుడి, మోసంబి, జాఫ, వాసింగ్టన్ నావెల్, వాలెన్సియా, మంచి రూట్ స్టాక్‌తో బడ్డింగ్ చేసిన మొక్కలనే ఎన్నుకోవాలని, సాధారణంగా ఉపయోగించే రూట్ స్టాక్స్ రంగపూర్ లైను మీద కట్టిన మొక్కలను నాటు కోవాలని సూచించారు. ఈ రకం మొక్కలు ముఖ్యంగా వేరుకుళ్లు తెగులు, బంక తెగులు, శంకు తెగులు వంటి వాటిని తట్టు కోగలవని, పంట కాల వ్యవధి కూడా ఎక్కువ సంవత్సరాలు ఉండటానికి అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి శైలజాలు, ఉద్యాన సిబ్బంది మల్లేశ్వరి, ఉమాదేవి, రైతులు పాల్గొన్నారు.

# నేడు అనంతపురంలో " నేను మౌన ప్రేక్షకుణ్ణి కాను " పుస్తక ఆవిష్కరణ సభ

**అనంతపురం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త బ్యూరో**

అనంతపురం నగరంలోనీ రెండవ రోడ్డులో గల గాయత్రి స్కూల్‌లో ఆదివారం సాయంత్రం 4 గంటలకు " నేను మౌన ప్రేక్షకుణ్ణి కాను " అన్న పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు పౌర హక్కుల సంఘం, విప్లవ రచయితల సంఘం నేతలు పేర్కొన్నారు. పౌర హక్కుల సంఘం, విప్లవ రచయితల సంఘం సంయుక్తంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి పౌర హక్కుల సంఘం నాయకుడు ఆదినారాయణ అధ్యక్షత వహించనున్నారు. ఈ కార్యక్రమంలో వక్తలుగా డిటిఎఫ్ రత్నం ఏసేప్, విప్లవ రచయితల సంఘం నాయకుడు పాణి, తదితరులు పాల్గొననున్నట్లు వారు తెలిపారు. ఆదివాసుల కోసం, వారి హక్కుల కోసం జీవిత మొత్తాన్ని అంకితం చేసిన పాస్టర్ స్టాన్ స్వామిని అక్రమంగా జైలులో నిర్బంధించి, కనీసం ఆయనకు బెయిల్ కూడా ఇవ్వకుండా చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఇందులో బాగంగా ఆయన మరణానికి కారణమైన ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ ఆయన తన అనుభవాలను ఒక పుస్తకం రాశారు. ఆ అనుభవాలను తెలుగులో " నేను మౌన ప్రేక్షకుణ్ణి కాను" పేరుతో ఆర్.వి.వి.కన్వీనర్ అరుణ్ అనువదించారు. అనంతపురంలో ఆదివారం ఈ పుస్తక ఆవిష్కరణ ఉంటుంది. హక్కుల సంఘాలు, విద్యార్థులు, మేధావులు, సాహితీ మిత్రులు ఈ పుస్తక ఆవిష్కరణ సభకు వచ్చి పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య డాక్టర్ ఎం విజయశ్రీ



నూతన ప్రిన్సిపాల్ కు శుభాకాంక్షలు తెలుపుతున్న వైద్యులు మరియు ఇతర సిబ్బంది

**అనంతపురం వైద్యం సెప్టెంబర్ ఐదు ప్రభాతవార్త**

అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల 17 వ ప్రిన్సిపాల్ గా ఆచార్య డాక్టర్ ఎం విజయ శ్రీ పదవి బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ లోని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో పేథాలజీ ప్రధాన విభాగాధిపతిగా పనిచేసిన డాక్టర్ ఎం విజయశ్రీ కి అదనపు వైద్య విద్యా సంచాలకులు గా పదోన్నతిపై అనంతపురం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు బదిలీ అయ్యారు .అందులో భాగంగా శనివారం పూర్వ ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ షారోన్ సోనియా నుంచి పూర్తి బాధ్యతలను తీసుకున్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని అన్ని విభాగాల వైద్యులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఆఫీసు సిబ్బంది పుష్పగుచ్చాలతో నూతన ప్రిన్సిపాల్ కు శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పూర్వ ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ షారోన్ సోనియా, వైస్ ప్రిన్సిపాల్ ఆచారి డాక్టర్ శంకర్, ఆఫీసు పర్యవేక్షకులు అతావుళ్ళ, మోలా సాబ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని ఎంపీకి వినతి

**గార్లదిన్నె సెప్టెంబర్ 06 ప్రభాతవార్త**



ఎంపీకి వినతి పత్రం అందజేస్తున్న కల్లూరు గ్రామ ప్రజలు

గార్లదిన్నె మండల కేంద్రంలోని కల్లూరు గ్రామ ప్రజలు కల్లూరు రైల్వే స్టేషన్ నందు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మినారాయణను శనివారం ఆయన కార్యాలయం నందు కలిసివినతి పత్రం అందజేశారు.. గుంతకల్లు నుండి తిరుపతి వెల్లే రైలు బండి మరియు తిరుపతి నుండి గుంతకల్లు వెల్లు రైలు బండ్లు టైమింగ్ మార్చటం వలన, గూల్యపాల్యం రైల్వే స్టేషన్ నుండి అనంతపురం మరియు ధర్మవరం రైల్ స్టేషన్ వరకు, రైలు బండ్లు టైమింగ్ మార్చడంవలన, స్కూలు విద్యార్థులకు కాలేజి స్టూడెంట్లకు, మరియు ప్రజలకు, కూలీలు పనిచేసుకొని బ్రతకడానికి వీలు లేకుండ పోయింది. అలాగే గుంతకల్లు నుండి అనంతపురం స్టేషన్ల మధ్య చాలా గ్రామాలు వున్నాయి ఆ గ్రామాల నుండి ప్రజలు చాలా ఇబ్బందిపడుచున్నారు. గుళ్యపాళ్యం స్టేషన్, వెంకటాంపల్లి స్టేషన్, ఇమాంపురం స్టేషన్, ఖాదర్ పేట స్టేషన్, కల్లూరుస్టేషన్, గార్లదిన్నె స్టేషన్ల ప్రజలు స్కూలు విద్యార్థులు కాలేజి విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుచున్నారు. కావున పై విషయాలు గమనించి రైల్వే జి.ఎం.కి, గుంతకల్లు డి.ఆర్.ఎం కి మీరు కూడా బలంగా సమస్యను పరిగనలోకి తీసుకోని అదేమాదిరిగా రైలు బండ్లు నడపాలన్నారు. ఏ ఎక్రెస్ రైలు బండ్లు, ఆపలేదు మీరు దయవుంచి కల్లూరు స్టేషన్ లో కుర్లా, కోయంబత్తూరు ఎక్స్ ప్రెస్, ధర్మవరం టూ మచిలీపట్నం ఎక్రెస్, యశ్వంతపూరు టూ కాచిగూడ ఎక్రెస్ రైలుబండ్లను కల్లూరుజంక్షన్లో నిలుపుదల చేయాలని కల్లూరు గ్రామ ప్రజలు ఎంపీని కోరారు.

**కెఎస్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో**

# ఘనంగా టీచర్స్‌డే వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యలత

**అనంతపురం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త బ్యూరో**

కెఎస్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీచర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.కెసి.సత్యలత మాట్లాడుతూ.. విద్యార్థుల సౌకర్యం కోసం నిరంతరం పని చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకున్నప్పుడు ఆనందంగా ఉంటుందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా తనవంతు ప్రయత్నంగా ఎంపి, ఎమ్మెల్యే సహకారంతో కాలేజీ హాస్టల్ అదనంగా తరగతి గదుల కొరకు నిధులను మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మ ఉఖ్య అతిథులుగా రిటైర్డ్ ప్రిన్సిపాల్ డా.ఎ.చంద్రశేఖర్, లాయర్ అబ్దుల్ రసూల్ విచ్చేసి మాట్లాడుతూ.. విద్యార్థులకు మార్గ దర్శకం చేస్తూ ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తూ ఉంటారన్నారు. చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ.. సమాజంలో ఎలాంటి పరిస్థితులైనా ధైర్యంగా ఎదుర్కోవాలని చిన్ని చిన్నన విషయాలకు అమ్మాయిఇలు ఆత్మహత్యలకు పాల్పడకూడదన్నారు. అనంతరం రెండవ సెమిస్టర్, నాలుగో సెమిస్టర్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.సుబ్బన ్న, డిప్యూటీ కమిషనర్ కమర్షియల్ టాక్సెస్, ఎం.యూనస్ లాయర్ హ్యూమన్ రైట్స్ ఫోరం, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మిరంగయ్య, ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ పర్వీస్, డాక్టర్ సి.రామాంజినేయులు, అనురాధ, రమాదేశి, మేరీ మాధురి, ఆదినారాయణ, పాతి మునిసా బేగం, శివశంకర్, ధనలక్ష్మి, అధ్యాపక బృందం, అధ్యాపకేతర బృందం, విద్యార్థినులందరూ పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన సూపర్ సక్సస్ చేద్దాం

**- తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి..**

**కూడేరు, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త**

ఉరవకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే ఆర్థిక శాఖ మంత్రి పయ్యావులకేశవ్, తెదేపా సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు ఆదేశాల మేరకు అనంతపురంలో 10 తేదీ జరగబోవు, సూపర్ సిక్స్-సూపర్ హిట్ కార్యక్రమానికి ఎన్డీఏ కూటమి నాయకులతో కలిపి రాయలసీమ వ్యాప్తంగా భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఇందుకు కూడేరు మండల వ్యాప్తంగా భారీ జన సమీకరణ కోసం నాయకులతో కార్యకర్తలతో శనివారం కూడేరు మండలంలోని టీటీడీ కళ్యాణ మండపములో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేద్దాం అంటూ కార్యకర్తలకు తెలిపారు. ఉరవకొండ నియోజవర్గం కూడేరు నుంచి భారీ ఎత్తున జనం తరలిరావాలి అని, కూటమి పార్టీల కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఈ సభకు జనసేన పార్టీ అధ్యక్షులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివీఎస్ మాధవ్ తోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చోళ సముద్రం మురళి, మాజీ జెడ్పిటిసి రామచంద్రయ్య, మాజీ ఎంపీపీ బ్రహ్మయ్య, మండల ప్రధాన కార్యదర్శి జి శివయ్య, కూడేరు సర్పంచ్ లలితమ్మ, మాజీ ఎంపిటిసి భాస్కర్ గౌడ్, జయప్రకాష్ గౌడ్, మాజీ కోఆప్షన్ నెంబర్ భాష బాటా వెంకటేష్,, బిజెపి నాయకులు మండల అధ్యక్షుడు నాగరాజు, కిసాన్ మోర్చా బిజెపి అధ్యక్షులు కె.మలోబులు, నారాయణపురం రామాంజనేయులు, కొర్రకోడు గోపాల్, కే రామాంజనేయులు, జనసేన పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

04ATP13_04ATP13.qxd 06-09-2025 PM 11:13 Page 1



## నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ప్రసాదం ఏర్పాట్లు

**- ప్రతి ఒక్కరూ ఆనందంగా కార్యక్రమాన్ని జయప్రదం చేయండి - పార్లమెంట్ సభ్యుడు బి.కె పార్థసారథి**



ప్రసాదాన్ని అందజేస్తున్న దృశ్యం

**రొద్దం. సెప్టెంబర్ 6 ప్రభాతవార్త.**

మండల కేంద్రంలో వెలిసిన 21 అడుగుల మట్టి వినాయకుని నిమజ్జన కార్యక్రమం సందర్భంగా హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీ కే పార్థసారథి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ ప్రజలకు పెద్ద ఎత్తున అన్న ప్రసాదం ఏర్పాటు చేయడం జరిగింది సందర్భంగా తెల్లవారుజాము నుండి శశిభూషణ్ పటేల్ పర్యవేక్షణలో రైస్ మిల్లులో తెల్లవారుజామునుండే అన్నప్రసాదాలు ఏర్పాటు చేసి రొద్దం నాలుగు కూడలిలో అన్న ప్రసాదం ఏర్పాటు చేసి హాజరైన ప్రతి ఒక్కరికి స్వయాన వడ్డించడం జరిగింది ఎంపీ బీకే పార్థసారథి వినాయకుడి దగ్గర ప్రత్యేక పూజా కార్యక్రమాలు గావించి గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని ఇంత పెద్ద ఎత్తున కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని నిర్వహించడం గ్రామంలో మిగతా 10 వినాయక విగ్రహాలు ఈ రోజున నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొని ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిమజ్జనం జరపాలని తెలియజేయడం జరిగింది వినాయకుని కమిటీ సభ్యులు ఎంపీపీ పార్థసారథికి తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువా కప్పి పూలమాలవేసి ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పొత్తూరి నారప్ప ఈడిగ శ్రీనివాసులు మురళి రొద్దంకంపల్లి నాగరాజు సత్తి నాగరాజు రాజప్ప మధు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జిల్లాలో పలువురు ఎంపిడివోలకు పదోన్నతులు



**అనంతపురం సిటీ, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

జిల్లాలో పని చేస్తున్న 9 మంది ఎంపిడిఓలకు పదోన్నతులు కల్పిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 51 మంది ఎంపిడిఓలకు డిఎల్‌డిఓలుగా డిడిఓలుగా పదోన్నతులు కల్పించారు. అందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో పని చేస్తున్న శివానందనాయక్, వెంకటరామిరెడ్డి, షకీలాబేగం, సరస్వతి, రఘునాథగుప్తా, ఆజాద్, రామకృష్ణ, నరేంద్రకుమార్, శకుంతలకు పదోన్నతులు కల్పించడమే కాకుండా ఆయా స్థానాలను కేటాయిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు.

## ఘనంగా పల్లె కృష్ణ కిషోర్ పుట్టినరోజు వేడుకలు





బాలాజీ విద్యాసంస్థల అధినేత పల్లె కృష్ణ కిషోర్ పుట్టినరోజు వేడుకలు శనివారం పి. వి .కే. కే ఇంజనీరింగ్ కళాశాలలో కుటుంబ సభ్యులతో జరుపుకుంటున్న దృశ్యాలు

**అనంతపురం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త బ్యూరో**

శ్రీ బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె కృష్ణ కిషోర్ పుట్టినరోజు వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. అనంతపురం సమీపంలోని ఆలమూరు రోడ్డులో ఉన్న పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో కుటుంబ సభ్యుల మధ్య నిరాడంబరంగా పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పివికేకే ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు, ఇతర సిబ్బంది ప్రత్యేకంగా పుట్టినరోజు సందర్భంగా పల్లె వెంకటకృష్ణ కిషోర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

## అంగరంగ వైభవంగా మహారాజా గణపతి నిమజ్జన వేడుకలు

**ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి**





మహారాజా గణపతినిమజ్జన వేడుకల దృశ్యాలు





**అమరాపురం సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన అమరాపురం నందు పాత పోలీస్ స్టేషన్ ఆవరణంలో శ్రీ వరసిద్ధి వినాయక యువక సంఘంఏర్పాటు చేసిన అమరాపురం కా మహారాజా గణపతి నిమజ్జనం వేడుకలు అంగరంగ వైభవంగా శనివారంజరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి విచ్చేసి బారీ శోభయాత్రను జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా గణపతికి విశేష పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో వినాయకుని సేవలు చేయడం ద్వారా విఘ్నములు తొలగి గ్రామంలో ప్రశాంతత దొరుకుతుందన్నారు. యువకులు మహారాజా గణపతి వేడుకలను వైభవంగా నిర్వహించడం మరియు భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడాన్ని వరసిద్ధి వినాయక సేవా సంఘం సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా విచ్చేసిన ప్రముఖులకు నిర్వాకులు ఘనంగా సన్మానం చేశారు. అమరాపురం పట్టణంలోని ప్రధాన పురవీధుల గుండా మహారాజా గణపతిని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన కళాకారుల నృత్య ప్రదర్శన డీజే కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా శోభా యాత్రను నిర్వహించారు. వరసిద్ధి వినాయక ఈ యొక్క సేవాసంఘం సభ్యులు భారీసంఖ్యలో విచ్చేసిన భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అమరాపురం ఎస్సై ఇషాక్ భాషా, ఏఎస్ఐలు రామాంజనేయులు, రమణ మరియు పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి, టిడిపి మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సహకార సంఘం అధ్యక్షుడు గణేష్, మాజీ కన్వీనర్ శివరుద్రప్ప, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు శివకుమార్ యాదవ్,అమరాపురం టిడిపి యువ నాయకుడుకేఎన్ఎం సురేష్, మండలక్లస్టర్ కన్వీనర్ నవీన్ కుమార్,కోకన్వీనర్ చన్నప్ప, సీనియర్ నాయకులు మారుతి ప్రసాద్, సహకార సంఘం డైరెక్టర్ దాదా పీర్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చంద్రశేఖర్ గుప్తా,మండల డీలర్ల సంఘ అధ్యక్షుడు తిప్పేస్వామి,ఉపాధ్యక్షుడు స్టూడియో హనుమంతు, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు రఘు, మాజీ ఎంపీపీ రామిరెడ్డి, సర్పంచ్ ధనుంజయ, నిరంజన్, ఎం బి అశోక్ కుమార్, పేలుబండ రామన్న, టీచర్ గోవిందప్ప, డీలర్ రమేష్, మాజీ డీలర్ శ్రీనివాస్, వాదిరాజ్, సప్లయర్ రాఘవేంద్ర, ఆర్ఎస్ ఆర్, యంజారప్ప, మాజీ ఎంపిటిసి చంద్రప్ప, పుల్లికుంట రాజు మాజీ ఎంపీటీసీ ధనుంజయ తదితర నాయకులు పాల్గొన్నారు.

## 24 గంటల్లోపు ప్రతీకార హత్య కేసు చేదింపు..

**మొదటిపేజీ తరువాయి...** మాట్లాడుతూ మోటార్ సైకిల్‌పై కూర్చున్నాడు. ముందుగా పగతో ఉన్న నిందితుడు భూచిపల్లి బాలకృష్ణ రెడ్డి, తన సహచరులు సయ్యద్ ఇలియాజ్, దేరంగుల అంజినేయులతో కలిసి కారులో వేగంగా అక్కడికి చేరుకుని, ముందుగా వేసిన ప్రణాళిక ప్రకారం వెనుక నుండి అతని మోటార్ సైకిల్‌ను ఢీకొట్టి లోకేంద్రను రోడ్డు మీద పడగొట్టాడు. వెంటనే బాలకృష్ణ రెడ్డి మరియు ఇలియాజ్ కోడవళ్లతో దాడి చేసి, తల, ముఖం, ఛాతి, పొట్ట, చేతిపై తీవ్రంగా గాయపరిచారు. నాతండ్రిని చంపినవాడివి, నిన్ను కూడా చంపుతాను" అంటూ బెదిరించి, అతన్ని అక్కడికక్కడే హతమార్చారు. అనంతరం ముగ్గురు నిందితులు అదే కారులో పరారయ్యారు. స్థానికులు మరియు అతని తండ్రి సంఘటన స్థలానికి చేరుకుని లోకేంద్ర మరణాన్ని గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ఇది వ్యక్తిగత ద్వేషంతో ముందుగా ప్రణాళిక వేసుకుని, క్రమంగా అమలు చేసిన దారుణ హత్యగా వెలుగులోకి వచ్చిందన్నారు.నేరానికి ఉపయోగించిన మారుతి సుజుకి షిఫ్ట్ కార్ ( ఎ పి 02 పి 6226), నేరానికి ఉపయోగించిన రెండు రక్తపు మరకలతో కూడిన కోడవళ్ళు. ముద్దాయిలకి సంబంధించిన మూడు మొబైల్ ఫోన్లు. మృతుడైన లోకేంద్రకు చెందిన రెడ్మీ టచ్ మొబైల్ ఫోన్ మరియు లోకల్ కంపెనీ వాచ్ ని నేర స్థలం నుండి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. సుమారు ఒకసంవత్సరంక్రితం ఆటోబాడుగు వివాదంలో, లోకేంద్ర మద్యం మత్తులో ఉన్న సమయంలో నిందితుడు బాలకృష్ణ రెడ్డి తండ్రి శ్రీనివాసులు రెడ్డిని దారుణంగా హత్య చేశాడనీ , ఈ ఘటనతో తీవ్రంగా ద్వేషాన్ని పెంచుకున్న బాలకృష్ణరెడ్డి, ఎలాగైనా లోకేంద్రని చంపాలనే ఉద్దేశ్యంతో, ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించి, తనస్నేహితులు అయిన సయ్యద్ ఇలియాజ్ మరియు దేరంగుల అంజినేయులు తో కలిసి ముందుగా ప్రణాళిక వేసి, లోకేంద్రను వెంబడించి, కారుతో గుద్ది, కోడవళ్ళతో దాడిచేసి హత్యచేసినట్లు ఎస్పీ తెలియజేశారు. ఈ సమావేశంలో ఎస్పీతో పాటు ధర్మవరం టూ టౌన్ సిఐ రెడ్డప్ప పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ సభను సూపర్ సక్సెస్ చేద్దాం

**కూటమి పార్టీల కార్యకర్తలకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పిలుపు**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**పుట్టపర్తి టౌన్, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త**

అనంతపురం లో ఈనెల 10న జరిగే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ సభను సూపర్ సక్సెస్ చేద్దామని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, సీఎం పర్యటన సమన్వయ కర్త తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ కూటమి పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ తోపాటు మంత్రులు ఎమ్మెల్యేలు ఈనెల 10న సూపర్ సిక్స్ సూపర్ హిట్ సక్సెస్ సభకు అనంత జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న సందర్భంగా శనివారం పుట్టపర్తి నియోజకవర్గ కూటమి పార్టీల నాయకులు,కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి పర్యటన జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 మాసాలు పూర్తిచేసుకుని సూపర్‌సిక్స్ పథకాలను సూపర్‌హిట్ అమలుచేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలుతెలిపే విధంగా అనంతలో జరిగే ముఖ్యమంత్రి సభతో పక్కన ఉన్న పులివెందుల ఎమ్మెల్యే వైసీపీ అధినేత జగన్ వెన్నులో వణుకు పుట్టేలా భారీ ఎత్తున జనం సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. పుట్టపర్తి నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో కూటమి పార్టీల తరఫున కార్యకర్తలు తరలివచ్చి ముఖ్యమంత్రి సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ప్రభాకర్, ఏపీ కుమ్మరి శాలివాహన సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వరన్, రాష్ట్ర డైరెక్టర్లు కాలే నాయక్ ,యశోద రాయుడు, మండల కన్వీనర్లు,స్థానిక కూటమి పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశం వెంటనే నిర్వహించాలి

**-వార్షిక సమావేశం ఆగస్టులోనే జరగాల్సి ఉన్నా నిర్వహించలేదు -ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మెన్ వై.శివరామిరెడ్డి**

**ఉరవకొండ, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**



వై.శివరామిరెడ్డి

ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశ ను (ఐఏబీ) వెంటనే నిర్వహించాలని ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మెన్ వై. శివరామిరెడ్డికోరారు. శనివారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.వై. శివరామిరెడ్డిమాట్లాడుతూ రైతులు సకాలంలో పంటలు వేసుకోవడానికి వీలుగా నీటి కేటాయింపులు ఎంత మేరకు జరుగుతాయో, ప్రాజెక్టుల్లో నీటి లభ్యత ఎంత మేరకు ఉందో నిర్ణయించి అందుకు సరిపడా రైతులు పంటలు సాగు చేసుకునేందుకు వీలుగా ప్రతి యేటా ఆగస్టు నెలలో వార్షిక ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశం నిర్వహించడం అనవాయితీగా వస్తోందన్నారు. అయితే ప్రభుత్వం ఇప్పటి వరకు ఈ ఏడాది సమావేశం నిర్వహించలేదన్నారు. అనంతపురం జిల్లాలకు సాగునీటి కోసం ఏకైక వనరుగా ఉన్న హెచ్ఎల్‌సీకు నీరు ఎప్పుడు వదులుతారో, ఎంతకాలం నీటి లభ్యత ఉంటుందో తెలియక రైతులు పంటల సాగు చేసుకోలేకపోతున్నారన్నారు. వెంటనే ఐఏబీ సమావేశం నిర్వహించి నీటి వనరుల కేటాయింపు ఎంత కాలం వరకు చేయగలుగుతారో తెలియజేస్తే రైతులు దానికి అనుగుణంగా పంటలు సాగు చేసుకోవడానికి వీలు ఉంటుందన్నారు. గతనెల 25న తాను డీఆర్సీ సమావేశానికి హాజరైన సందర్భంలో ఐఏబీ సమావేశం విషయమై ప్రస్తావించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి వివరించారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు అందుబాటులో ఉండాలి



సలహా మండలి సమావేశం దృశ్యం

**మొదటిపేజీ తరువాయి...** కల్పించాలని, పార్కింగ్ వద్ద కూడా డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేసి రోగులకు ఆస్పత్రిలో లభించే సదుపాయాల సమాచారం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. బ్లడ్ బ్యాంక్‌లో రక్తనిధి ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని, రోగులకు అవసరమైన అన్ని మందులు ఆస్పత్రిలో నిల్వలో ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఆస్పత్రి ఓపి కేంద్రాల వద్ద వీడియో డిస్ప్లే బోర్డులు, షెడ్లు ఏర్పాటు చేయాలని, ఆస్పత్రిలో ఎలక్ట్రిక్ పనులు సక్రమంగా చేసి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ఆర్.ఓ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని చెప్పారు. అంతకు ముందు ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపీ చీటీల విభాగాన్ని కలెక్టర్ ప్రారంభించారు. మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ హిందూపురం ఆస్పత్రిలో రోగుల రద్దీ అధికంగా ఉంటుందని, ముఖ్యంగా సీజనల్ వ్యాధుల సమయంలో మరింత రోగులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. అందువల్ల ఆస్పత్రి పనులను స్ట్రీమ్‌లైన్ చేసి, మెరుగైన నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. డిసెంబర్ నాటికి ఆస్పత్రిలో అన్ని సదుపాయాలు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుని, డాక్టర్ల కొరతను తక్షణమే పరిష్కరించి రోగులకు సేవలందేలా చూస్తామని తెలిపారు. ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి పార్కింగ్ సదుపాయాలపై సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. అలాగే హిందూపురంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ హై స్కూల్ గ్రౌండ్‌ను సందర్శించి, అక్కడ నిర్మాణంలో ఉన్న ఇండోర్ షటిల్ స్టేడియం పనులను పరిశీలించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పి ఏ వీరయ్య, కమిటీ సభ్యులు బి.ఎస్. విద్యాసాగర్, బి. బాలాజీ, సి. అన్నపూర్ణ, శ్రీనివాస్ నాయుడు, వి. శ్రీదేవి, టి.ఎస్. ప్రభు కుమార్, బి. మధుసూదన్, ఎం. శ్రీదేవి, డీఎం అండ్ హెచ్ఓ ఫిరోజా బేగం, ఆస్పత్రి సూపరింటెండెంట్ సి. అన్నపూర్ణ, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్.. సూపర్ హిట్ సభను విజయవంతం చేద్దాం

**శాసనసభ్యులు కాలవ పిలుపు**



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ కాలవ శ్రీనివాసులు

**రాయదుర్గం సెప్టెంబర్ 06ప్రభాతవార్త**

ఈనెల 10నఅనంతపురం లోనిర్వచనున్న సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభను విజయవంతం చేయాలనీ పార్టీ నాయకులకు, కార్యకర్తలుకు శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు శనివారం పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి ఫంక్షన్ హాల్ లో ఆయన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భారీ సభను తొలిసారి జిల్లాలో నిర్వహిస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు తోపాటు రాష్ట్రమంత్రులు, కూటమిఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 3.50 లక్షల మందితో భారీ సభను ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. రాయదుర్గం నియోజకవర్గం నుంచి 15వేల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను తరలించడానికి తగిన ఏర్పాట్లు చేద్దామని సూచించారు. కనీసం 10వేల మందికి బస్సులు, ఇతరత్రా రవాణా వాహనాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మిగిలిన వారు తమ సొంత వాహనాల్లో లేదా ఇతరాత్ర రవాణా ద్వారా సభాస్థలికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఏ ఏ ప్రాంతాల నుంచి ఎంత మంది వస్తారన్న విషయాన్ని మండలాల వారీగా చర్చిద్దామని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇది తమ బాధ్యతగా గుర్తించి ఎక్కువమంది సభకు హాజరయ్యేలా చూడాలన్నారు. రాయదుర్గం నియోజకవర్గ ఇన్చార్జీలుగా మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డిలను పార్టీ అధిష్టానం నియమించిందన్నారు. సభను విజయవంతం చేయడానికి మన నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున జనాలు వచ్చారని అధిష్టానం వద్ద వారు గర్వంగా చెప్పుకునేలా ఏర్పాట్లు చేద్దామని పిలుపునిచ్చారు. పదో తేదీ నాటి భారీ సభ విజయవంతనికి ఇప్పటినుండి సిద్ధం కావాలని సూచించారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపిని తరిమి తరిమి కొట్టాలి.... మాజీ మంత్రి దేవినేని**

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ని అడ్రస్ లేకుండా చేయాలనీ వంద కు వంద శాతం గెలవాలని దేవినేని పిలుపునిచ్చారు. వైకాపా అధినేత జగన్ అసెంబ్లీకి దుమ్మా కొడుతూ తనను ఎన్నుకున్న ప్రజల జవాబుదారీతనాన్ని విస్మరించారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే..! అసెంబ్లీకి రానని ఎవరిని బెదిరిస్తారని ప్రశ్నించారు. ఐదేళ్ల పాలనలో వారు సాగించిన అరాచకాలు, అకృత్యాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్తూ ప్రతిపక్ష హోదా లేకుండా తీర్పు ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతి ఒక్కరి అవసరాలను గుర్తించి ఒక్కొటిని పరిష్కరిస్తూ ముందుకు వెళుతుందనన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను ప్రజల్లోకి విరివిగా తీసుకెళ్లాల్సిన అవసరం మనందరిపై ఉందని గుర్తు చేశారు. ఈ సభను అందుకు ఓ వేదికగా మార్చుకొని గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఐదింటిని నెరవేర్చడం జరిగిందని, ఆ ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కే దక్కుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పరిశీలకులుగా మాజీ మంత్రి దేవినేని ఉమ మహేశ్వర రావు, రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాస రెడ్డి, కొండా రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బలరామి రెడ్డి, కురుబ హనుమంతు, పాటిల్ మోహన్ రెడ్డి, లాలేప్ప తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లపై మంత్రులు, ఎమ్మెల్యేలతో కలసి పరిశీలించిన ఎమ్మెల్యే అమిలినేని

**సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభ ఏర్పాట్లతోనే వైసీపీ నాయకులకు వెన్నులో వణుకు ఎమ్మెల్యే అమిలినేని**



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను మంత్రులు ఎమ్మెల్యేలతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు

**కళ్యాణదుర్గం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :**

అనంతపురం జిల్లా కేంద్రం శ్రీనగర్ కాలనీ జీఎమ్ ఆర్ గ్రౌండ్స్ లో ఈ నెల 10న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న సూపర్ సిక్స్.. సూపర్ హిట్ భారీ బహిరంగ సభ ఏర్పాట్లను, ముఖ్యమంత్రి చంద్రబాబు రానున్న హెలిప్యాడ్ వద్ద పరిస్థితిని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, మంత్రులు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, పురపాలక శాఖ మంత్రి నారాయణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, ఎంపీ పార్థసారధి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వీ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, బండారు శ్రావణి, పల్లె సిందూర రెడ్డి, ఏలూరు సాంబశివారెడ్డి, దగ్గుబాటి వెంకట ప్రసాద్, ఎమ్మెస్ రాజు, ఉగ్ర నరసింహరెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, బిజెపి జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్,టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు.. అతిరథ మహారథులు పాల్గొనే సభకు వచ్చే వారికి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. సమావేశాన్ని ఎలా నిర్వహించాలి..?, జన సమీకరణ, సభకు వచ్చే వారికి ఆహారం, తాగునీరు, వీఐపీ భద్రత, పార్కింగ్ వంటి అంశాల గురించి చర్చించారు. ఆ తర్వాత సభ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. నిర్వాహకులకు కొన్ని సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. ముఖ్యమంత్రి మన జిల్లాలోనే మొదటిగా సూపర్ సిక్స్ విజయోత్సవ సభను నిర్వహిస్తునందున పెద్ద ఎత్తున ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొనే అవకాశం ఉంటుందని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా, సభకు వచ్చే కూటమి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు..సభకు సంబంధించిన ఏర్పాట్లు తుది దశకు వచ్చాయని తెలిపారు.

## సీయంయన్ ఆసుపత్రిని సీజ్

**అనంతపురం వైద్యం సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**



ఆసుపత్రిని సీజ్ చేస్తున్న డిఎంఅండ్‌హెచ్ఓ, డెమో అధికారులు

అనధికారికంగా అబార్షన్ నిర్వహించి యువతి మృతికి కారణమైన సీఎంఎన్ ఆసుపత్రిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈ భ్రమరాంబా దేవి ఆధ్వర్యంలో శనివారం డెమో అధికారులు సీజ్ చేశారు .అనంతపురం పట్టణం లోని రామచంద్ర నగర్ లో ఉన్న సీ యం యన్ ఆసుపత్రిలో గత మూడు రోజుల క్రితం అబార్షన్ చేయగా అది వికటించి మెరుగైన వైద్యం కోసం కర్నూల్ కు వెళుతూ మార్గం మధ్యలో సదరు యువతి మరణించిగా గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి లో పోస్ట్ మార్టం నిర్వహించి ,గు త్తి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినట్టు అక్కడి పోలీస్ లు ద్వారా తెలిసిసుకున్న డీ యం హెచ్ఓ డా ఈబీ దేవి ఈసంఘటనను సుమోటో గా తీసుకొని సంబంధిత రివెన్యూ , పోలీస్ సిబ్బంది తో కలిసి ఆసుపత్రిని తనిఖీ చేసి విచారణ కోసం వెళ్లగా అప్పటికే గతమూడురోజులుగా ఆసుపత్రిమూసి వుంచినట్టు తెలుసుకోని ఆసుపత్రి అనుమతిపొందిన మేనేజ్మెంట్ కు ఫోన్ చేయగా ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం తో తక్షణ చర్యగా నోటీస్‌లు అతికించి మరో తాళంతో ఆసుపత్రిని సీజ్‌చేశారు. అలాగే జరిగినసంఘటనపై పూర్తి సమాచారం సేకరించి చట్ట పరంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని డియంహెచ్ఓ డా ఈబి దేవి తెలిపారు . ఈ తనిఖీలో సంబంధిత వి ఆర్ వో నాగవేణి , కానిస్టేబుల్ ప్రసాద్ నాయక్ , డెమో త్యాగరాజ్ ,డిప్యూటీ హెచ్ ఈ ఓ.గంగాధర్ పాల్గొన్నారు.

**ఎట్టకేలకు స్పందించిన డెమో అధికారులు.....**

సీఎంఎన్ ఆసుపత్రిలో అనధికారికంగా లింగ నిర్ధారణ, అబార్షన్లు జరుగుతున్నాయని సమాచారం డెమో అధికారులకు తెలిసినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లు సదరు ఆసుపత్రి పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాపాడుతూ వచ్చిన అధికారులు చివరకు ఒక యువతి మృతితో ఈ సమస్య ఎక్కడ తమ మెడకు చుట్టుకుంటుందో అని సదరు ఆసుపత్రిని సీజ్ చేశారు. పలుమార్లు సదరు ఆసుపత్రి పై ఫిర్యాదులు చేసిన అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనకడుగు వేయడానికి ఏం కారణాలు ఉన్నాయో వారికే తెలియాలి. తూతూ మంత్రంగా విచారణ చేసి మరొక పేరుతో అదే ఆసుపత్రికి అనుమతులు ఇచ్చేందుకు లోలోపన మంతనాలు జరుగుతున్నట్లు సమాచారం. నగరంలో అనేక ఆసుపత్రులలో మరణాలు సంభవిస్తుంటే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా నాన్చుడు దూరంతో ఉన్నారని పలువురు విమర్శిస్తున్నారు. ప్రాణాలు హరిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులపై నిఘా ఉంచాల్సిన అధికారులు మామూళ్ల మత్తుతో అటువైపు కన్నెత్తి చూడడం లేదని తేటతెల్లమవుతుంది.